కవితా ప్రభాస

పద్య సంకలనము



నండూరి రామకృష్ణమాచార్య

కవితా ప్రభాస

రచయిత

నండూరి రామ కృష్ణమాచార్య

ప్రచురణ

శ్రీమతి నండూరి సుభద్ర

1-8-76 ప్రెండరు గాస్టు రోడ్డు

35 జవాహరు నగరు కాలనీ

సికిందరాబాదు - 500 003.

KAVITHA PRABHASA

Poetry

కవితా ప్రభాస - పద్య సంకలనము

Author : Dr. Nandury V. Rama Krishnamacharya M.A. Ph.D.

రచయిత : డాక్టరు నండూరి రామ కృష్ణమాచార్య

Publishers ప్రకాశకులు

Smt. N. Subhadra
1-8-76 Prenderghast Road
35 Javahar Nagar
Secunderabad. 500 003.

Price మూల్యము : Rs 25/-

First Edition ప్రథమ ముద్రణ : 1991

"కవితా ప్రభాస"
తెలుగు విశ్వవిద్యాలయమువారి
ఆర్థిక సాహాయ్యముచే ప్రచురితము.

KAVITA PRABHASA is printed with the Financial Aid of the Telugu University.

Printed and Typeset at Chary & Company, 9-4-9 Charles Street, Secunderabad-3. Phone: 76650 & 75570

రచయితకు

కవితా కర్పూర నీరాజనాలు

హృదయ మమృత సముద్రము;
వదనము కవితా లతాంగికి నర్తనశాల;
సదన మతిథికోటికి నాటి ఋష్యాశ్రమము;
విశాల వసుధా కుటుంబి - నీ సాటి నీవె.

- శ్రీ శనగన నరసింహస్వామి

ధైర్యము రొమ్ము విచ్చినది,
ధర్మము త్రాసున తూగె; అంచితౌ
దార్యము వ్రేళ్లు పాతుకొనె;
దక్షత పీఠము వైచి నిల్చె; సత్
కార్య వినిర్వహమ్మొ ఇలు
గట్టి వసించెను - రామ కృష్ణమా
చార్యుల గుండె లోతుల ప్ర
సన్నతలో - మధురానుభూతిలో.

అష్టావధాని, శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు

అమృత హృదయునకు, సంయమి
సమ సహృదయునకు, ఉదారచరితునకు, మహో
త్తమ గుణ భరితునకు, క్రియా
కమనీయ దయామయునకు, కావ్యమయునకున్.

నయమార్గ సుప్రసిద్ధా
న్వయ శ్రీ నండూరి వంశ నామార్యునకున్
జయమార్గ సుప్రసిద్ధా
హ్వయ వేంకటరామ కృష్ణమాచార్యునకున్

- డాక్టరు ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి

ఎవ్వాని గళములో నవ్వు కొన్నది నంద
నారామ మధుర మందార వల్లి;
ఎవ్వాని కలములోనివ్వటిల్లెను విశ్వ
భారతీ మంజు మంజీర రవము;
ఎవ్వాని చెలిమిలోనివ్వాళు లెత్తెను
పర్దాలు లేని సౌహార్ద లక్ష్మి;
ఎవ్వాని కలిమిలో పవ్వళించెను సుప్త
గుప్త దానవ్రత పాత్ర తృప్తి;
అతడు నండూరి వంశ పయః పయోధి
చంద్రముడు - రామ కృష్ణమాచార్య సుకవి;
గద్య పద్య తారాతోరణాద్యనేక
కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

- కరుణశ్రీ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి

శ్రీ నండూరన్వవాయం
స్థిరతర సుయశ స్సింధు చంద్రం సుధీంద్రం
స్వాదు స్వాదు స్వభావం
సలలిత చరితం సాహితీ సార్వభౌమం
సాక్షాత్ పుంభావ వాణీం
సరస మధురసత్ కావ్య శిల్ప ప్రవృత్తిం
వందే శ్రీరామ కృష్ణాహ్వయ
మనిశమహం వాఙ్మయ శ్రీ సమగ్రం.

-సంగీత సాహితీ సిద్ధ వృద్ధ శ్రీ
శ్రీమాన్ దీక్షితదాసు భాగవతారుగారు

సీ. నెత్తమ్మి రేకుల మెత్తదనము తెచ్చి
పదముల కూర్పుతో - పదిల పరచి
హరి నీలముల జోరు - అంబుదమ్ముల సొరు
బావ సంపద లోన - భద్ర పరచి
విజ్ఞాన విభవమ్ము - వేదాంత సారమ్ము
ఉక్తి వైచిత్రితో ఒడిసి పట్టి
సప్త స్వరాలలో - స్పందించు రాగమ్ము
వాక్సుధాలహరికి వాజి సేసి
తే.గీ తెలుగు పలుకుల సొబగుల తేనె లూర
పారిజాతమ్ము పూయించె - "ప్రగతి గీత",
రామకృష్ణుని దలపించు రామకృష్ణ
డనఘు డాధ్యుండు నండూరి కగుత - శుభము.

- వీరాసు అయ్యపురెడ్డి
న్యాయవాది - మాజీమంత్రి

కానిమ్మోయి కవీంద్ర నీ అతిథి సత్కారమ్ము నీ యింటిలో
వాణీ పాద గలంగల న్మధుర నిక్వాణమ్ముతో ఇందిరా
పాణి ప్రస్ఫుట పద్మ గర్భ మధుసంపాతమ్ముతో, నిత్య క
ల్యాణమ్ముల్ మరి పచ్చ తోరణముగా ఆచార్య మిత్రా ఇకన్.

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

క్రొత్త పాతల మేలి కలయిక

నండూరి రామ కృష్ణమాచార్య శైలియందును శబ్దజాలము నందు క్రొత్త పాతల మేలి కలయిక కన్పట్టు చున్నది.

- తారాతోరణ పీఠిక - కట్టమంచి రామలింగారెడ్డి

Extract from "Contemporary Indian Literature"
Published by the
SAHITYA AKADEMI - NEW DELHI

THE NEO - CLASSICISTS

Within recent years, one notices the beginning of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo-classicists like NANDURI KRISHNAMACHARYULU, Jandhyala Papayya Sastry and G. Joshua are questioning the value of the Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the postwar world an equilibrium has to be achieved between matter and spirit between idealism and realism. The Neo-classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

Prof : G.J. SOMAYAJI

Dr. Krishnamacharya - is a Future Tense amongst the modern poets. Telugu Literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra.

అంకితము

గాంధీ మహాత్ముని ఆదర్శ స్మృతికి –

జనన మందినాడ – సత్యాగ్రహ యుగమ్ము
భరత చరిత వెల్లివిరిసి నపుడు;
నీతి దేశభక్తి వాతావరణ మందు
చదువు సాగె – పిదప – బ్రదుకు గడచె.

కావ్య మల్లినాను – "కవితా ప్రభాస" గా
నీతి సూత్ర భాష్య నియతి చేసి;
అక్షరాల నూలు – అల్లి బిల్లిగ నేసి
ఇచ్చినాడ నీకు కృతిని నేడు.

నిలిచినాడ – నాడు – నీ ఆశ్రమము నీడ,
గుండె కుప్పవోసి కొన్ని నాళ్లు;
చెన్నపురిని – నీకు – చెప్పి స్వాగత మేను
ధన్యజీవి నంచు తలచినాను.

శాంతి సమర మందు – స్వాతంత్ర్య యజ్ఞాన
సగము కాలినట్టి సమిధ నేను;
చిత్త శుద్ధి తోడ – శేష జీవిత మెల్ల
సేవ చేతు గాంధి దేవ – నీకు.

– నండూరి రామ కృష్ణమాచార్య.

గాంధీ మహాత్ముడు

మట్టి పుట్టు వతడు - మంత్ర తంత్రము లేదు,
మర్మ మేమి లేదు - మాయ లేదు;
మంచితనము తప్ప - మహిమ లేవియు లేవు;
అత డజాత శత్రువగుచు - బ్రతికె.

ఎగుర లేదు అతడు - గగన వీథులలోన,
కదల లేదు అతడు కడలి నీద;
అతడు పాదచారి యగుచు ఈ పుడమిపై
నడువగలిగె - సాటి నరుల తోడ.

నిలువ గలిగె ఎట్టి నిరుపేదలేయైన
వాని మ్రోల - తలలు వంచుకొనక;
నిలువ వలసివచ్చె - తలయెత్తు కొనకుండ
వాని మ్రోల - ఎట్టి ప్రభువు లైన.

వక్ర రాజకీయ వైక్లబ్య వామనుల్,
దీన హీన భారతీయ జనులు;
దేశ భక్తి లగుచు - దివ్య త్రివిక్రమ
స్ఫూర్తి - విమల కీర్తి చూరగొనిరి.

హింస - యెచట నున్న - ఏ రూపమున నున్న;
ఏవగించె నతడు - ఎడద కుమిలి;
వెక్కిరింప గోరి - వెడలి వచ్చినవారు;
చేరి - చూచి - మారి శిష్యులైరి.

అతని దృష్టిలోన - హక్కు లన్నవి లేవు;
విలువ నిచ్చె బాధ్యతలకె - అతడు,
ఆతని జీవనాడి - నీతీ నిజాయితీ
మానవతకు - అతడు - మారు పేరు.

అతడు తిరుగబడెను - యంత్ర సంస్కృతి పైన,
అయ్యో రాట్న మతని - ఆయుధమ్ము;
మనిషి శ్రమకు అతడు - మాంగళ్యమును - గూర్చె
శాంత్యహింస అతని శ్వాస లయ్యె.

తలచి నట్టి దతడు - దాచకుండగ చెప్పె,
చెప్పినట్టి దాని చేసి చూపె;
నికరమైన దతని త్రికరణ ప్రతిపత్తి,
తప్పు చేసినపుడు ఒప్పుకొనెను.

తన వ్రతమ్ము - చెడును వినరాదు కనరాదు
పరుల గూర్చి చెడుగు పలుకరాదు;
ముందు పెట్టుకొనెను - మూడు కోతుల బొమ్మ
మనసు చెదరకుండ - మరువ కుండ.

బ్రహ్మచర్య నిష్ఠ - ప్రాయోపవేశమ్ము
మౌన దివస దీక్ష - పూనె నెవడు?
సత్యసంధు డగుచు - స్వార్థమ్ము విడనాడి
బ్రతికె పుడమిపైన - అతడు - "గాంధి"

"నమ్మలేని నిజము - నరదేహమును దాల్చి
పుడమి పైన గాంధి నడచెననుట";
అంచు శాస్త్రవేత్త - ఐన్‌స్టీను - వచియించె,
కాలపురుషు గుండె గగురు పొడువ.

ప్రబల జేయు హింస - ప్రతిహింసనే సదా,
విష వలయము - హింస - విశ్వమందు;
ఏది విశ్వశాంతి కేకైక మార్గమ్ము?
పుడమి యందు గాంధి బోధ తప్ప?

★ ★ ★

హక్కుల కొర కెవ్వరారాట పడరాదు
పగలు, రాత్రి వెంట వచ్చినట్లు
నరులు పూని తాము - నెరవేర్చ బాధ్యతల్
హక్కు లవతరించు ఆ క్షణంబె.

★

తప్పు లేని వాడు - ధరణి లోపల లేడు;
తప్పు నొప్పు కొనుట గొప్ప గెలుపు;
అనుభవించు - నరుడు - అవనిలో నరకమ్ము
దాచి పెట్టినట్టి - తప్పు వలన.

- గాంధి

స్వాగతాంజలి

1946 జనవరి 21 వ తేదీన చెన్నపురికి విచ్చేసి నపుడు మహాత్మునకు సమర్పించిన స్వాగతార్ఘ్యము. నాటి ఆంధ్రపత్రిక ముఖపత్రము నుండి పుర్ముద్రితము.

సత్య-మహింస ఉచ్ఛ్వాస నిశ్వాసముల్ సల్పి
జీవించెడి సత్వమూర్తి
విశ్వ కల్యాణ గవేషణా పథమందు
పయనించు ఒంటరి బాటసారి
సత్యాగ్రహమ్ముచే శాత్రవులను శిష్య
నిర్వి శేషుల జేయు నిగమరాశి
రాట్నము ధర్మచక్రము చేసి పరిశుద్ధ
ఖద్దరు నిర్మించు కర్మయోగి.

బుద్ధదేవుడు పుట్టిన పుణ్య భూమి
నేటికిని పునఃపూతమై నెగడునట్లు
అవతరించిన యట్టి - ఓ అమృతమూర్తి
అందుకొనవయ్య మా స్వాగతార్ఘ్యములను.

కారణ జన్మ మెత్తి చరఖా భుజసీమను మోసితెచ్చి మా
భారతభూమిపైకి దిగి వచ్చిన దివ్య మహర్షి విశ్వ సం
సారములో అహింసకయి సత్యము కోసము దీనమానవో
ద్ధారణకై తపస్సులు సదా వెలయింపు మజాత శత్రవా.

నీ వడుగు మోపిన చవిటి నేలయైన
తీర్థ భూమి యగును భరత దేశమందు;
నీవు పల్కిన పలుకులు - నిగమ భాష
యగుచు నినదించుచుండు మహానుభావ.

సేవా ధర్మము మానవాకృతిని దాల్చెన్ నీ స్వరూపమ్మునన్
సేవాగ్రామ తపోవనిన్ - నవనవోన్మేషమ్ము గల్పించు దీ
క్షా వస్త్రమ్ములు నేయు రాట్నముల ఝంకారమ్ములున్;
నీ అహిం
సావాదమ్ములు; శాంతిదీప కళికల్; స్వాతంత్ర్య శంఖ ధ్వనుల్.

బుద్ధు డహింసచే భరత భూమిని క్రీస్తుకు పూర్వమందు ధ
ర్మోద్ధరణ మ్మొనర్చెను శుభోదయ మయ్యెను; దాస్య శృంఖలా
బద్ధులు భారతీయుల తపస్సులు పండె, స్వతంత్ర మంత్ర సం
శుద్ధులు శాంతి సత్య రణ శూరులు పట్టిరి నీ పతాకమున్.

ఖద్దరు పాత గట్టి చరఖా పయి నూలును దీసి పూర్వ పుం
బెద్దరికమ్ము నేడు నిలబెట్టుట కోసము బందికాన ము
ప్రొద్దులు వెళ్లబుచ్చి నగు మోమున సత్యముకై, అహింసకై
ముద్దులు మూటగట్టెడి ప్రచారము సల్పుము దీన బాంధవా.

ఇది రవి అస్తమించని మహీస్థలి నంతయు నేలు వారితో
ఎదురుగ నిల్చి ఢీకొనుట ! ఎంతటి సాహసమయ్య !! వీరులై
కదనము చేయగా దగిన కత్తి కటారులు లేక దాసులై
ఒదిగి అణంగిపోయి పడియుండిరి ఇంతకు ముంద రందరున్.

పరమ గంభీర మంచు నీ వాక్యములకు
భాష్యకారులు గ్రంథాలు వ్రాసినారు !
కాని ! - ముగ్ధ మోహనము నీ మౌనమునకు
భాష్య మొనరింప గల్గిన వారు - లేరు !!

పూసిన మల్లెపూలొలుక బోయుచు, చల్లని చూపుతో ఉప
న్యాస సుధా మధూక్తు లిడ అంజలి పట్టును గాని నీ నిది
ధ్యాసకు తల్లడిల్లు - జగ మంతయు అర్ధ మెరుంగ లేక; నీ
బోసి మొగమ్ము విప్పుము - ప్రభూ - చిరు వెన్నెల సోన జల్లులన్.

మూడు కాళ్ల ముసలి వాడవైనాడవు
వృద్ధ వీరుడా యికెంత సేవు
శాంతి సమరములను సాగింప గలవోయి,
ఆగు మపుడె దూర మేగినావు.

పక పక నవ్వుచున్ ముసలి పండువు, ఆగుము, దవ్వు దవ్వులన్
చక చక సాగిపోకు, నీ అడుగు జాడల వత్తుము మేము కూడ, ఏ
తికమక లైన వే మరచి దేశము కోసము దీక్షతో; ఒకా
నొక దినమందు ముందు తలలొగ్గును నీకు జగంబు లన్నియున్.

యుద్ధము పేర - ఘోర నరమేధము నిన్నటిదాక సాగె - ఆ
యుద్ధము అంత మొందె నని ఊరట చెందగ శాంతి లేదు, నే
డిద్ధరణిన్; ప్రజాసమితి ఇప్పటి కైనను గూడ అత్మ సం
శుద్ధిని చెంద లేదు, దయచూడుము దీన జనావళిన్ - గురూ.

ఆటము బాంబు విశ్వవిలయమ్ము ఘటించెడి త్రోవద్రొక్కి, ఆ
రాటము చెందుచున్నది ధరాస్థలియంతయు; ధర్మసూత్ర ముల్
రాటము మీద త్రిప్పి, అనురాగ తరంగితమైన వేడి క
న్నీటిని కార్చి మమ్ము కరుణింపుము విశ్వజనీన జీవనా.

గాంధి మహాత్ము దివ్య పదకంజము లంట జనావళుల్ జగద్
బాంధవ, తీర్థయాత్రకయి వచ్చిరి లెమ్మిక, ఊతకోలతో;
బంధములో కృశింప దిక భారత మాత; స్వతంత్ర గీతికా
బంధురమైన దుందుభి రవంబులు నింపుము బోసి నోటితో.

గురు స్తుతి

శ్రీమాన్ తెవికిచెర్ల కందాళ గోపాలాచార్యులవారు

గోపాలాచార్య గురు
శ్రీపాదుల చేరినాడ - చిన్నతనములో;
తా పేర్మిని సంస్కృత వి
ద్వాపారీణునిగ చేసె దయతో నన్నున్.

లోకోత్తర ధిషణకు ఏ
కైకోదాహరణమైన "కౌముది" చదువన్,
శ్రీ కాళిదాస కవి వరు
శాకుంతల నాటకమ్ము చప్పగ దోచెన్.

శ్రీమాన్ మరంగంటి వేంకటాచార్యులవారు

వెలుగు బాట వేసె - వేంకటాచార్యుండు
కోరుకొండ వాసి - గొప్ప గురుడు;
ఆంగ్ల భాష నేర్పి - ఐదంయుగీనమౌ
తాళపు చెవి - నాకు దాన మిచ్చె.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు

సువిశాల యశోభాసురు;
నవ 'కవిసమ్రాట్టు' సత్యనారాయణ సూ
రి వరుని; రామాయణ క
ల్పవృక్ష రచయిత నుతింతు- ప్రాగ్రసరు- గురున్.

శ్రీ వర్ధుల చిన సీతా రామస్వామిశాస్త్రిగారు

వ్యాకరణ జగద్ గురువుగ
ప్రాకట విఖ్యాతి గన్న వర్ధుల కడనే
సాకల్యంబుగ ఆంధ్ర
వ్యాకృతులను చదివినాడ - ప్రాంజలి నగుచున్.

శ్రీ అబ్బూరి రామకృష్ణరావుగారు

తెలుగు వెదకు కొనుచు - తెలుగు సాహితి దాటి
ఎగురునట్లు - నన్ను - ఎవడు తీర్చె ?
అద్వితీయ ధిషణు - అబ్బూరి గృహనాము
రామ కృష్ణ రావు - ప్రస్తుతింతు.

శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు

జంగమ గంగా యమునా
సంగమముగ - ప్రాక్ ప్రతీచి సాహిత్యములన్,
పింగళి లక్ష్మీకాంతుడు
సాంగోపాంగముగ - నన్ను చతురత దిద్దెన్.

శ్రీ గరికపాటి మల్లావధానిగారు

సల్లలిత మనస్వి - మల్లావధాని ఆ
దేశభక్తు డైన - దేశికుండు,
అమృత హృదుడు - నేర్పె అష్టావధానమ్ము
ఆ గురూత్తమునకు - అంజలింతు.

శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు

ఋషి - మనీషి - బుధుడు - ఇతిహాస నిపుణుండు
శాసన లిపి - నాకు చదువు చెప్పె;
అతని కందజేతు - నతులు - మల్లంపల్లి
సోమశేఖరునకు - సుచరితునకు.

సందేశము

గొప్పదైన దేది ? - గుప్త దానమె సుమ్మి !
ఎంచి యెవరి కేది ఇవ్వదగును ?
శాత్రవులకు ఇమ్మి - క్షమను కానుక చేసి,
స్నేహితులకు - ఇమ్మి స్నిగ్ధ హృదిని;
తరుగ నట్టి పేర్మి - తల్లి దండ్రుల కిమ్మి;
పెండ్లమునకు - కూర్మి ప్రేమ నిమ్మి
సత్ప్రవర్తనమ్మి - సంతానమున కిమ్మి;
పేదవారి కిమ్మి - పెద్దరికము;
అతిథి కంటె ముందు - అభ్యాగతుల కిమ్మి
సంతసమ్మి గొలుపు - స్వాగతమ్మి;
ఎల్లి జనుల కిమ్మి - ఇంపైన మర్యాద;
సేవకులకు - హెచ్చు జీత మిమ్మి;
యుగ యుగాల కిమ్మి - ప్రగతి యోగము నందు
పుడమి చెరగి పోని - అడుగు జాడ,
తీర్చి దిద్దుకొనిన - త్రికరణ ప్రతిపత్తి
ఎపుడు నీవు నీకు - ఇచ్చు కొనుము,
ధర్మ నిరతి తోడ - ధన్యవాదము లిమ్మి
"మృత్యు దేవి" - సంగమించి నపుడు.

లలిత కళలు

జనన మందె - కవిత - జగదుద్భవము ముందె
సృష్టి చేయ నెంచు స్రష్ట మదిని;
శిల్ప మవతరించె - సృష్టి తో పాటుగా
కవల బిడ్డ యౌ చు - అవని మీద;

వెలసె - చిత్ర విద్య - తొలి యుషస్సులలోన
పూచినట్టి మొదటి పువ్వు తోడ;
రాగ తాళ లయల - బ్రహ్మండరుతి తోడ,
అవని మీద గాన మవతరించె;

నరుల తోడ - స్రష్ట - ధరణి యంతయు నింప,
పుట్టె గొప్ప నటన - చిట్ట చివర;
ఇన్ని కళల వెరసి - ఈ జగన్నాటకం
బాది అంతు లేని - అద్భుతంబు.

** **

నరులు

తేనె గ్రోలు చుండు - తేటి పువ్వుల చేరి;
శ్లేష్మ మందు ఈగ చేరుచుండు;
కందిరీగ - జనుల కాటేసి - పరుగెత్తు;
నరుల - మూడు తెగల - నరయ వచ్చు.

స్వాప్నిక సరస్వతి

తెలిపె - శ్రీ సరస్వతీదేవి - కలలోన
నాకు కానుపించి నవ్వు లొలికి;
"డెబ్బ దేండ్లు వచ్చె - డబ్బుకై ఇబ్బంది
లేదు - వేరు లోటు లేదు నీకు.

వద్దు - కోరవద్దు - పెద్ద ఉద్యోగముల్;
ఇల్లు వదల వద్దు - ఇంక మీద;
సభలు వద్దు - ఇంక - సత్కారములు వద్దు;
కలల అలల పొంగు కవిత లల్లు.

నిద్ర - దేహమునకు - నిత్యావసరమైన;
అంతరాత్మ కేది అవసరమ్ము ?
చేయ వలయు - మూగ ప్రాయోపవేశమ్ము
వారమునకు - ఒక్కసారి యైన.

స్నాన - మవసరమ్ము - శారీర శుద్ధికై,
అవసరమ్ము గాన - మాత్మ కొరకు;
మౌన మవసరమ్ము - మనసు శుభ్రము చేయ;
అవసరమ్ము - దాన - మాత్మ కొరకు.

నీకు - అవసరమ్ము - ఏకాంత వాసమ్ము;
మౌన సాధనా సమాధి నిష్ఠ ;
ధ్యాన యోగ మొసగు - జ్ఞాన వ్యాయామమ్ము;
గుండె కుదుపు కవిత - కూర్చు కొరకు.

పడుగు పేక చేసి - నుడి జిల్గు జిగి బిగుల్
తలపు తళుకు బెళుకు - తాపినావు;
ప్రజల హృదుల యందు - గిజిగాని గూడులై;
తావక కవిత లిక తాండవించు.

గుండె పొలము దున్ని - పండించుకోవయ్య
క్రొత్త విలువ లెల్ల కూర్మి పేర్మి;
కవిత పొదిగి నట్టి - భవదీయ భావముల్
ఎల్ల లెల్ల దాటి ఎగురు గాక".

కోడి కూసె నంత - కొక్కురో కో యంచు,
మేను జలదరింప మేలుకొంటి;
శ్రీ సరస్వతీ సుధా సూక్తి లహరిలో,
హంస వోలె - ఓలలాడె - మనసు.

కవితా ప్రభాస

వెల్ల గొడుగు నాకు - వినువీథి వెలుగెల్ల;
పృథివి యెల్ల - పెద్ద పీట నాకు;
ఆజవంజవమ్ము - నా జటా జూటమ్ము;
తారకా కిరీట ధారి నేను;
ఏ దిగంబరుండ - ఆది భిక్షుకుడనే
ఎల్ల జగతి - సొంత యిల్లు నాకు;
నా చరిత్ర యందు - నా జీవ నాడిలో
కడలి ఆటు పోటు సుడులు తిరుగు;
నా మనోజవమ్మునకు - సాటియే లేదు;
వెలుగు పరుగు గూడ - వెనుక పడును;
దూరదర్శనమ్ముతో గూడ - అణిమాది
శత సహస్ర సిద్ధియుతుడ నేను;
నిత్య సత్యవచుడ - మృత్యుంజయుడ నేను;
ధర్మసార సూత్రధారి నేను;
యుగ యుగాంతరాల - ప్రగతి సంస్కృతి కేను
ప్రథమ వారసుండ - పృథివి మీద;

నాదు సంతకాలు - నక్షత్ర - కూటముల్;
ప్రేలి ముద్ర నాది - వేల్పు విల్లు;
విశ్వ మెల్ల ఏలు - విజ్ఞాన వేదాంత
శేముషీ కళాభిషిక్తులైన
సార్వభౌము లెల్ల - సామంతులే నాకు;
ప్రేమతో నమస్కరించు వారె;
వెలసినాడ - సూక్ష్మ విశ్వరూపముతోడ;
ధరణి - మనుజవేషధారి కవిని;
రవియె చూడ లేని - ప్రవిశేషములు గాంచు
క్రాంతదర్శి - నైన కవిని నేను;
చూడ దలతు రేని - నేడె - నా రూపమ్ము,
ఇవ్వ గలను - దివ్య దృష్టి - మీకు.

విశ్వ శిల్పము

నాకు వింత గొలుపు - ఏకాంతముగ - రెండు;
నడికి రేయి - పడక విడిచి - నడువ,
మినుకు మినుకు మనెడి వినువీధి తారకల్;
మన్ను మిన్ను వెదకు - మనిషి మెదడు,
విశ్వ శిల్పమందు విలసిల్లు - శ్రుతి లయల్;
గణితబద్ధ మణువు అణువు గూడ;
కాదు - సృష్టియెల్ల - యాదృచ్ఛికము - గాదు;
పెను ప్రయోగశాల - మనిషి యొడలు;
ప్రకృతి యెల్ల - చూడ - భగవంతు నీడయే,
అప్రమేయు డతడు - అవ్యయుండు;
సృష్ట మెదడు గూర్చి - సందేహపడ నేల ?
మనిషి మెదడు గూర్చి మనకు తెలియ,
పరిహరింప దగిన "ప్రక్షిప్తమా"? - కాదు;
మట్టి బెడ్డ మీది మనిషి ఉనికి;
ఎంత కాల మిట్లు - ఈ సృష్టి కొనసాగు ?
విశ్వశిల్పి లీల - విడని ముడియె.

స్వాతంత్ర్య శపథము

మంచితనము నందు - మానవత్వము నందు,
నీతి యందు - నిండు నిజము నందు,
ఆచరించి చూపు - ఆదర్శముల యందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

సహన మందు - స్వచ్ఛ సరళ జీవిత మందు,
ధ్యాన యజ్ఞ మొసగు - జ్ఞాన మందు,
సర్వ మత సమత్వ సహజీవనము నందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

అభిరుచులకు అమరు- అభినివేశము లందు,
మెదడు - ఎడద గలుపు - చదువు లందు,
విద్య కుచితమైన - ఉద్యోగముల యందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

కార్య దీక్ష యందు - క్రమ శిక్షణము నందు,
కళల యందు - బ్రదుకు విలువ లందు;
శ్రమకు పేర్మి పెంచు - సామ్య యోగము నందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

దేశభక్తి - కార్చు దివ్య రక్తము నందు,
త్యాగ యోగ మిచ్చు - దాన మందు,
యువక దీప్తి తెచ్చు - నవ యుగోదయ మందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

కర్మ యోగ మందు - ధర్మ వీరము నందు,
నిజము - తుదకు పొందు - విజయ మందు,
చిత్తశుద్ధి యెక్కు - సింహాసనము నందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

సృష్టి శిల్ప మరయు - జిజ్ఞాసు హృదయాల,
ఎప్పు డెదుగుచుండు ఎల్ల లందు;
సరస హేతువాద సార్వభౌమత యందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

స్వేచ్ఛ యందు - విశ్వ విజ్ఞాన గతి యందు,
గొప్పతనము గూర్చు - గురువు లందు,
సమత యందు - సర్వ సౌభ్రాతృ గుణమందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

శాంతి యందు - విశ్వ సహకార కృషి యందు,
మానవాళి ఐకమత్య మందు;
సాంస్కృతిక పరాగ సమ్మేళనము లందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

సంఘసేవ యందు - సంక్షేమ రాజ్యాంగ
సాధనా విధాన సవన మందు;
చిత్తశుద్ధి యందు - శీల రక్షణ మందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

"బ్రతుకు నందు తనకు ప్రతికూలమౌదాని,
నరుడు చేయరాదు పరుల కెపుడు",
అనెడి గొప్ప సూక్తి - ఆచరించుట యందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

బ్రతుకు నందు - ఒక్క శ్రుతిలోన ఏకమై,
తలపు వాక్కు కర్మ అలరి నపుడు,
కలుగు నట్టి - పూర్ణ కైవల్య మత మందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

సర్వ మత విశాల సామరస్యము నందు;
సర్వ వాద భేద సహన మందు;
సర్వ జనులు కోరు - శాంతి భద్రత లందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

ఉచిత విద్య యందు - ఉచిత వైద్యము నందు,
గ్రాస వాస వసన కల్ప మందు;
స్త్రీల కభ్యుదయము చేకూర్చు కృషి యందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

అందర కొనగూరు - అవకాశముల యందు;
ప్రజలు ఎన్నుకొనెడి - ప్రభుత యందు;
వాఙ్మనఃకరణల స్వాతంత్ర్యముల యందు;
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

సర్వ జనులు - తుదకు సాధించు వసుధైక,
రాజ్య పౌరసత్వ రచన యందు;
విశ్వహితము కోరు - వేదాంత మితి యందు,
కలదు - నమ్మకమ్ము - కలదు మాకు.

బ్ర ది కు

బ్రదుకు - అరయ - గొప్ప బహుమానమే యైన
చిన్మయుండ వగుచు స్వీకరింపు,

ఆడవయ్య - బ్రదుకు - ఆటయే యైనచో
గెలుపు ఓటములకు - ఉలుకు గొనక,

బ్రదుకు - ఒక విషాద భరిత రూపకమైన,
వేషధారి రంగు - వేసుకొనుము.

పరగు నెడల - బ్రదుకు - బహుదూర యాత్ర యై;
నడచి పొమ్ము - ఆటవిడుపు లేక

అయిన యెడల బ్రదుకు - ఐశ్వర్య ధామమ్ము,
ధర్మకర్త పాత్రధారి వగుము;

అమరు నెడల - బ్రదుకు - అద్దాల మేడయై,
రాళ్ళు రువ్వవద్దు - ప్రజలపైన.

అసలు - బ్రదుకు - గొప్ప ఆదర్శ కృషియైన,
వెట్టి చాకిరీకి వెసులుకొనుము,

అచ్చమైన ప్రేమ అయినచో బ్రతుకెల్ల
అనుభవింప వయ్య - హాయిమీర;

బ్రదుకు - విడువ రాని సదవకాశమె యైన,
పట్టు సడలకుండ పాటు పడుము;

వీర మరణమైన - విజయమైనను పొందు
బ్రదుకు - ఘోర యుద్ధ రంగ మైన;

బ్రదుకు అనిన - పూర్తి బానిసత్వమె యైన
కోరి - లేని చెవుడు కూర్చుకొనుము;

అయిన యెడల - బ్రదుకు - అందాల పూదోట
ప్రస్తుతింపవయ్య బ్రహ్మదేవు;

ధర్మ మర్మ మెంచి - తగు జవాబుల నిమ్ము
బ్రదుకు - యక్షు ప్రశ్న పత్రమైన;

బ్రదుకు - ఎంచిచూడ - ప్రహసనంబే యైన,
పొంద వయ్య ముక్తి - బొందె తోడ.

ఎంచి చూడ బ్రదుకు - ఏకాంశమా ? కాదు;
శత సహస్ర పత్ర సంపుటమ్ము;

బ్రదుకు - బ్రదుకె - అయిన - ఇది జగన్నాటికే
అనుచు తెలిసి - మసలు కొనుము - చాలు.

స్త్రీ

చదల వేల్పు వింటి సౌకుమార్యము లేరి;
వండ్రు - మట్టి మార్దవమ్ము - మెదిపి,

చిలిపి మొగ్గ లోని - సిగ్గు నిగ్గులు చిల్క,
లతల లోని కోమలత్వ మేర్చి;

మొక్కవోని - గడుసు నక్కజిత్తులు చేర్చి,
కూర్చి - పక్షి కూర్మ కూజితములు;

మెరపు తీగ మిసిమి మిరుమిట్లు - గుదిగ్రుచ్చి;
కడలి అలల నవ్వు సుడులు - తీర్చి;

కలిపి - వేగు చుక్క నెలవంక వెన్నెలల్;
నిలిపి - నివురు గప్పు నిప్పు వేడి;

కమ్మగాలి ముద్దు కౌగిలింతలు - పేర్చి;
స్త్రీని - విశ్వశిల్పి - సృష్టి చేసె.

- మనుస్మృతి నుండి.

ఒంటరి బాటసారి

ఏగదగును వేగ - ఏకాకివై నీవు,
ప్రక్కవారు తోడు రాని యెడల,

క్రమ్మవచ్చు - రేయి - చిమ్మచీకటి పొరల్,
ఆకసమున చుక్క లణగిపోయి;

కాగడాలు గాని - కర దీపికలు గాని,
హేరు గాలి లోన - ఆరగలవు;

దారి చూపలేవు - ధరణిలో దీపాలు,
ధర్మ దీప్తి ఒకటి దారి చూపు;

ప్రమిద - ఎడదలోన - ప్రజ్వరిల్లగ చేసి,
వెనుక చూపు వీడి వెడల వలెను;

ఎడద లోని ప్రమిద - ఏకాంత కాంతితో,
దారి చూపగలదు - ఆరకుండ;

కర్మయోగ మందు గమ్యమ్ము - గమనమే,
దారి తప్ప నట్టి - తాల్మి చాలు;

అపుడు - బ్రతుకు - సచ్చిదానంద యోగమే,
చావు లేదు - ధన్యజీవి కెపుడు.

పూవులు

పుట్టు బిడ్డ మనసు - పువ్వు పోలిక నుండు;
వెలుగు - కన్నుదోయి వెడలు చుండు;
ఎదుగు కొలది - వచ్చు - ఎన్నెన్ని మార్పులో
ప్రక్కనుండు పరిసరాల వలన.

పూలు గానె కొన్ని - పుడమిపై పడిపోవు,
వీడి రేకు లెల్ల వాడిపోయి,
రేపు మాపు - కొన్ని - రూపొందు పిందెలై
దిన దినాభివృద్ధి దీప్తి చూపి.

ఎదుగు బొదుగు లేక - ఎండిపోవును - కొన్ని
ప్రిదిలి పోవు - కొన్ని - పిందె గానె
పెరుగు కండ పుష్టి పెంచి - పిందెలు కొన్ని
కనుల పండు వౌచు - కాయ లగును.

మంచి పండ్లు గాగ - మారిపోవును కొన్ని;
పులుపు విరిగి - తీపి మలుపు తిరిగి;
విత్తనాలు పిదప - వెదజల్లు విశ్వాన,
పుడమి - తిరిగి పూలు పూయు కొరకు.

ప్ర యో జ కు డు

ఎవరు పెద్ద మనిషి ? ఎవ్వడీ జగతిలో
పూజనీయుడౌ - ప్రయోజకుండు ?
చదువు - రూపు - ధనము - పదవు లన్నిటి కేమి ?
గుండె పండి నట్టి గుర్తు లేవి ?

తాల్మి గల్గి - వీడి తత్కాల లాభమ్ము
ముందు మేలు - ఎవడు పొందగలడు ?
మంచితనము కెవడు - మారు పేరుగ తోచు;
అతడు గుండె పండినట్టి వాడు.

పరుల మీద - పూని - పగ దీర్చు కొనుటకై
స్వల్ప మైన బ్రదుకు నందు - తనకు
వ్యవధి లే దటంచు - ఎవడు భావించునో
అతడు - గుండె పండినట్టి వాడు.

ఎదుటివాని పైన - ఏ మాత్రమును ఈర్ష్య
ఓడి నపుడు చూపకుండు నెవడు ?
విజయ మంది ఎవడు - వినయమ్ము చూపించు;
అతడు గుండె పండినట్టి వాడు.

"మునుపె చెప్పినాడ - వినలేదుగా నీవు
చూడు ముప్పు వచ్చె నేడు నీకు"
అనుచు దెప్ప డెవడు - ఆత్మ నిగ్రహ మూని
అతడు గుండె పండినట్టి వాడు.

వాస్తవమ్ము దాచి - వ్యవహార సరళిలో
బూకరించకుండ - బొంకకుండ,
ఒప్పుకొను నెవండు - తప్పు చేసిన వేళ
అతడు గుండె పండినట్టి వాడు.

మార్చివేయు నెవడు - మార్చ గల్గిన దాని
మార్చ లేని దాని - మరచు నెవడు ?
ఓలలాడు నెవడు - ఉద్యోగ తృప్తితో;
అతడు గుండె పండినట్టి వాడు.

చేసి చూపు నెవడు - చెప్పినట్టిది యెల్ల,
చేయలేని దాని చెంత బోక;
హితము గూర్చు నెవడు - మితభాషియై పూని;
అతడు గుండె పండినట్టి వాడు.

చక్కదిద్దు నెవడు - చాకచక్యము తోడ
సాటి వారి లోని లోటు పాట్లు;
కొండ మీది కోతి - కోర డెవ్వడు దింప,
అతడు గుండె పండినట్టి వాడు.

గుబులు తెచ్చుకొనడు - కోపతాపాలతో
అపజయమ్ము వచ్చినపు డెవండు ?
నింద మోప డెవడు - క్రింది వారల పైన;
అతడు గుండె పండినట్టి వాడు.

చెడుగు మంచి అనిన - పడుగు పేకలె యంచు,
వెలుగు నీడ కలిసి మెలగు నంచు,
బ్రతుకు జంట మెలితి - గ్రహియించు నెవ్వాడు;
అతడు గుండె పండినట్టి వాడు.

మరచి నిన్న గూర్చి - మరచి రేపటి గూర్చి
ఈ ప్రపంచ మందు - ఈ క్షణాన,
చేసి చూపు నెవడు - చేయ గల్గిన దెల్ల;
అతడు గుండె పండినట్టి వాడు.

స్థలము - ధనము - తెలివి - సమయమ్ము పొదుపుగా
పాడు చేయకుండ - వాడు నెవడు ?
ఎవడు పాటు పడును - హెచ్చింప ఉత్పత్తి?
అతడు గుండె పండినట్టి వాడు.

తలచి నట్టి పనులు - తారు మారైనచో,
తొణక కుండ ఎవడు బెణక కుండ,
చీకు చింత వీడి - చిరునవ్వు చిందించు,
అతడు గుండె పండినట్టి వాడు.

పట్టు నెవడు - గరుడ పక్షి - పామును వోలె
ఏ సమస్యనైన - ఏపు మిగిలి;
చొరవ చూపు నెవడు - పరమ శాంతము తోడ;
అతడు గుండె పండినట్టి వాడు.

గుండె పండినట్లు - గుర్తు లెయ్యవి యంచు
అంతరాత్మ నెవడు - అడుగుచుండు?
తన్ను గూర్చి యెవడు - తర్కించు కొనుచుండు
అతడు గుండె పండినట్టి వాడు.

అంతరాత్మ బలము

చెడ్డ పనులు చేయ - స్నేహితుల్ శత్రువుల్
నన్ను తిట్టిపోసినారు చేరి;
కదల కాళ్లు రాక - కంటి నిద్దుర లేక,
ఇంటిలోన దాగియుంటి నేను.

మంచి పనులు చేయ మాత్సర్య పూరితుల్
నన్ను తిట్టిపోసినారు చేరి;
నవ్వుకొనుచు - నట్ట నడివీథిలో నేను.
నదరు బెదరు లేక - నడచినాను.

పొగడవచ్చు - లేక - తెగడవచ్చును జనుల్,
కారణాలు వేరు వేరు కలిగి,
మరణ శయ్య మీద - మనుజ సంఘము మధ్య,
అంతరాత్మ బలమె - అసలు బలము.

జయాపజయాలు

న్యాయ మున్న దపుడు నావైపు - తెగువతో
పోరినాను జయము కోరి నేను;
జయము కలిగె - అంత - సంతోష గర్వాన
కానుపించలేదు కనులు నాకు.

న్యాయ మపుడు లేదు నా వైపు - తెలివిగా
పోరినాను జయము కోరి నేను;
అపజయమ్ము కలిగె - అది సమంజస మంచు
నోరుమూసుకొనుచు ఊరకొంటి.

న్యాయ మపుడు లేదు నా వైపు - తెలివిగా
పోరినాను జయము కోరి నేను;
జయము కలిగె కాని - భయముతో సిగ్గుతో,
శిరము వంచుకొనుచు తిరిగినాను.

న్యాయ మున్న దపుడు నా వైపు - తెగువతో
పోరినాను జయము కోరి నేను;
అపజయమ్ము కలిగె - అహము వీడెను వేగ
ఆ క్షణాన యోగి నైతి నేను.

సమస్యలు

గోచరింపవచ్చు - కుబుసాలు మాత్రమే,
భయము గొలిపి - త్రాచు పాము లట్లు;
భ్రాంతి, గొలుపవచ్చు - పలు సమస్యలు గూడ
లేని పోని భీతి లేవ దీసి.

మొదట కానుపించు - కొదమ సింగము వోలె;
పోవ దరికి గంగి గోవె - అగును;
కడకు - బరువు మోయు - గార్దభమ్ముగ మారు;
ఏ సమస్యగాని ఎదురుకొనిన.

పిరికితనము వీడి - పెను సమస్యలు గూడ
ఎందరో పరిష్కరించినారు;
మారు రూపుతోడ - మన వెంట బడునట్టి
సదవకాశము లవి - వదల రాదు.

పట్టుదల

తెలివి తేట లున్న - తేజస్సు - వర్చస్సు
ఇది అసాధ్య మంచు వదలి వేయ,
మూతి ముక్కు ముడిచి- చేతగాదని చెప్పి
ప్రతిభ మారు దారి పట్టి మరల,
కృషి యొనర్చి కొంత - హేతువాద ప్రజ్ఞ
వచ్చి నట్టి దారి పట్టి పోవ,
వీలు కా దటంచు వేదాంత ధీయుక్తి
దిక్కు తోచకుండ తేరి చూడ,
వచ్చి చూచి వేగ వ్యాపార రంగమ్ము
వెనుక చూడకుండ వెడలిపోవ,
అవును కా దటంచు - ఆలోచనలు పల్పి
తర్క విద్య - ప్రక్క దారి పట్ట,
లాభ నష్టములకు - లౌక్యంబు వెల కట్టి
"సున్న" మిగులు నంచు సోది చెప్ప,
అంచనాలు తప్పి - వ్యవహార తత్త్వమ్ము
మనసు మార్చుకొనుచు మరలిపోవ,

విఫలమంది చూడ - విజ్ఞాన శాస్త్రమ్ము,
ప్రక్క కొదిగి నిలువ - రాజనీతి,
జయము దిగ్విజయము - సాధించునది యేది??
విస్మయమ్ము చెంద - విశ్వ మెల్ల?
చెమట పట్టునట్టి - శ్రమ కోర్చి పనిచేయు
గట్టి పట్టుదలయె - తుట్ట తుదకు.

ప్రగతి

జాతి మూల ధనము - నీతీ నిజాయితీల్
కాకి రాయి - బొగ్గు గనులు గావు,
దేశమునకు శ్వాస - సౌశీల్య సంస్కృతుల్ ;
ప్రగతి రాదు - శీల రక్ష లేక.

సామ్యవాద మందు - జాతీయ మొనరింప
దగిన వేవి ముందు - తత్ క్షణంబు?
విద్య - వైద్య సేవ - ఉద్యోగములు గాని
ఉక్కు గాదు - ఇనుప తుక్కు గాదు.

మానవత

కావు - చర్చి కరుగ - క్రైస్తవుండవు నీవు,
కావు - షెడ్డు కరుగ - కారు వీవు;
ఇరుగు పొరుగు పైన - కరుణ చూపుట మాని
ఆదివార భజన కర్థ మేమి?

కత్తిరింప నీవు - గడ్డమ్ము మీసమ్ము;
ఐదుసార్లు రోజు అరచి నంత,
దైవ భక్తి యున్న - దయ లేనిచో నీవు
కావు ముసలుమాను వీవు కావు.

కొట్టవచ్చు నీవు - గుడికేగి టెంకాయ,
కట్టవచ్చు రోజు పట్టు బట్ట,
సానుభూతి లేక - సాటి వారల పైన,
కావు - హైందవుడవు నీవు కావు.

జిలుగు లీను రంగు - తలపాగ చుట్టగా,
కత్తిరించ నట్టి గడ్డ మున్న;
కత్తి పట్టి నంత - కారుణ్యమే లేక;
కావు - సిక్కు వీవు కావు - కావు.

అగ్ర కులము నందు - అవతరించిన మాత్ర
జందె మున్న మాత్ర - జపము మాత్ర
చిత్తశుద్ధి లేక - శీలమ్ము లేకుండ
కావు - బ్రాహ్మణుడవు నీవు - కావు.

మానవుండె కాడు - లేనిచో - హృదయమ్ము;
కాడు - క్రైస్తవుండు - కాడు సిక్కు;
హైందవుండు కాడు - అతడు ముస్లిము కాడు;
వాడు - రాక్షసుండు - వసుధ పైన.

గుండెలోన - కరుణ - పండించు కొనుచున్న
వాడె క్రైస్తవుండు - వాడె సిక్కు;
వాడె హైందవుండు - వాడె ముస్లిము గూడ;
వాడె మానవుండు - వసుధ పైన.

కాలము

కాల మనెడి దొకటి - కలదు సృష్టికి ముందు,
కాల మొకటె లయము గడచి మిగులు,

చూడ పుడమి గాని - సూర్యచంద్రులు గాని
తారకా వికేతు తతులు గాని

కాల మనెడి కడలి కెరటాల పొరలలో;
పుట్టి గిట్టు నట్టి బుద్బుదములు;

అరయ కాల మొకటి అద్యంత రహితమ్మ్ము,
మాట కిటుకు దాటి - మనసు దాటి;

చోద్య మేమి కలదు చూడ కాలము కంటె,
అఖిల విశ్వమునకు ఆత్మ యేది?

పరమహంస - కాల పర్యాయ వేత్తయే;
అమృత రస సముద్ర మతని యెడద.

వయస్సు

యౌవనమ్ము - తెలుపు - ఆత్మవిశ్వాసమ్ము;
భయము తెచ్చిపెట్టు వార్ధకమ్ము;
గూడు కట్టుకొనిన కోరికల్ గుండెలో
పడుచుదనపు ప్రొద్దు పొడుపు తెలుపు;
డెంద మందు రేగు - సందేహముల్ తెల్పు,
ముట్టడించి నట్టి ముసలితనము;
గణన చేయరాదు - కాలమానము బట్టి;
మనసు తెలుపగలదు మనిషి వయసు.

వెలుగు బాట

సంప్రదాయ మెపుడు సాధించినది లేదు,
జగతి హితము గాని - ప్రగతి గాని;
అనుభవమ్ము లేని ఆదర్శశీలురే
వెలుగు బాట తరచు వేయగలరు.

ధనికు డేల చేయు తన మనో మధనమ్ము?
బీద సాద కట్టి వీలు లేదు;
మధ్యతరగతి ప్రజ మాత్రమే - యోజించి
వేయుచుండు జగతి వెలుగు బాట.

అభినవ పంచశీల

మరువ వచ్చు ఇపుడు - పరమేశుడనువాని,
కాని మరువరాదు మానవులను;
శ్రమయె జగతి బ్రోచు - ప్రార్థనా యజనమ్ము,
కలుగు మనుజ సేవ వలన - "ముక్తి"
సమత వలన కలుగు - స్వాతంత్ర్య యోగమ్ము,
నిక్క మైన శక్తి - నీతి నిరతి;
నేటి "పంచశీల" - పాటించు విధు లివ్వి
క్రొత్త ప్రొద్దు పొడుపు కూర్చుకొరకు.

మతము

మతమ మాట విడిచి - మానవత్వ మటంచు,
ప్రగతి యనుచు సామ్యవామనుచు;
హేతువాద మనుచు - ఎన్ని పేరులు పెట్టి
మనుజ సేవ యైన - "మతమె" యగును.

స్వార్థ రహిత మైన - సందేహమే యైన
చిత్తశుద్ధి యున్న చింత యైన;
త్యాగబుద్ధి యున్న - నాస్తికత్వము గూడ
మతమె యగును మనుజహితము గోర.

తపోవనము

ఇది తపోవనమ్ము - ఈ పర్వతాలలో;
స్వాగతమ్ము - ధ్యాన యోగులార,
బొందె తోడ ఇచట - పొంది కైవల్యమ్ము
పరమ హంస లగుచు - బ్రదుకవచ్చు.

విశ్వ శిల్పి ఘనత - వేద వేదాంగముల్
తేల్చి చెప్పలేక - తేలిపోయె;
చిన్న పూలు చాలు - చిగురుటాకులు చాలు;
సృష్టి దివ్య మహిమ - స్పష్ట పరచు.

సత్య మెచట? శివము సౌందర్య మెట నుండు?
పుడమి బ్రదుకు బీట ముడుల యందు??
అడవి చెట్ల మధ్య - ఆశ్రమంబున తప్ప,
స్వాగతమ్ము- ధ్యాన యోగులార.

విరులు పాడు - మౌన వేద ఋక్కుల వల్ల
జ్ఞాన ధన్యు డగును - ధ్యానయోగి;
అనుభవైక వేద్య మాధ్యాత్మిక సమాధి,
సాధ్య మగును - వన్యశాల యందు.

క్రొంజిగురాకు సోయిగము - కోకిల నాదము వృక్షవల్లరీ
కుంజకుటీర వాటికలు క్రొన్వీరి పుప్పొడి తావితెమ్మెరల్
సంజ వెలుంగువెల్లువలు సాధకులందర కందచేయు మృ
త్యుంజయసిద్ధి సంయమనయోగము ధ్యాన
తపోవనమ్ములో

ఈ ప్రపంచకమ్ము - ఎండమావుల వేట,
మానుకొనుట మేలు మమతలెల్ల,
చేరదగును అడవి చెట్ల నీడల పొంత
శాంతి నిచ్చు పర్ణశాల దరికి,

కవిత లోని గూఢ గంభీర భావముల్,
వీణ లోని నాద బిందు లయలు,
అనుభవింప వచ్చు - అతిలోక సంతృప్తి,
ధ్యానమందు - వన్య మౌన మందు.

చెట్ల వెల్లివిరియు - జీవ సౌందర్యమ్ము;
లలితకళలలోని - వెలుగు జిలుగు,
జగతి తాండవించు - సచ్చిదానందమ్ము;
ఎడద నింప గలవు - అడవి చెట్లు.

పసి పాపలు

మెత్తనైన లేత మెదడు - నెత్తురు - సిరల్,
గుండె ఆటు పోటు కండరాలు,

అవయవముల విరియు - నవ నవోన్మేషమ్ము,
సృష్టి చిద్విలాస సౌష్ఠవమ్ము,

జీర్ణకోశ పేటి - చెవి - వెన్నెముక - ముక్కు,
కలిగి - కనుల మెరయు వెలుగు జిలుగు,

ఈ క్షణమ్ములోనె - ఎదుగుచున్నవి గాన
రేపటించు శిశువు నాపరాదు;

ఇపుడు దొరలె నేని - ఎట్టి లోపము గాని,
బ్రదుకు చివురు మొలక ప్రిదిలిపోవు;

బాల బాలికలకు - ప్రాధాన్య మిచ్చుచో
యుగ యుగాలు మెచ్చు - ప్రగతి వచ్చు;

వంగ పువ్వు వోలె - రంగారు పసిపాప
మొగము నందు - వెలుగు - మొగ్గ దొడుగు;

వయసు ముదిరి - పుచ్చు వంకాయ గాకుండ
పేర్మి పెంచవలయు పెద్దవారు.

నదులు – కలుపు

కరువు – నీటి కొరత – వరద బీభత్సమ్ము
ఏక కాలమందె ఎచట నుండు?
బుద్ధిహీను లేలు – పుడమిలోపల గాక;
మార్చలేనిదేది – మనిషి మెదడు?

కదలిపోవుచుండ – గలగలా గోదారి
పసిడి పంట లేవి పండవయ్య;
గంగ నీరు తెచ్చి – కావేటిలో కల్పి
వరద బాధ తగ్గు – కరువు తగ్గు.

ప్రజలు దద్దరిల్ల – ప్రతివర్ష ఋతువులో
బ్రహ్మపుత్ర వరద బాధ లేల?
కలియు గాక వచ్చి – కన్యాకుమారిలో
పొంగి పొరలి – బ్రహ్మపుత్ర కాల్య.

ప్రజల హృదులు కలియు – భవితవ్య మేకమౌ
సకల నదులలోని జలము కలియు;
అభ్యుదయము వచ్చు – ఐకమత్యము హెచ్చు
భరత ఖండమందు ప్రజల మధ్య.

చెరువు లెల్ల నింపు - భరతదేశమునందు,
ఊరు ఊర - "త్రాగు నీరు" చేర్చు;
పడుగు పేక వోలె - పంటకాల్వలు త్రవ్వి
నదులు కలుపు - ప్రజల హృదులు కలుపు.

మతము

కాకి రాతి మట్టి గనులు మాత్రమె గదా
వివిధ మతము లెల్ల విశ్వమందు !
అచ్చమైన లోహ మందుండి విడదీయు
ప్రతిభ ఎవరికుండు బ్రతుకు నందు?

కానుపించనట్టి - కవచమ్ము రీతిగా
మతము తాల్పదగును - మానవుండు;
కంచుకమ్ము వోలె - కన్పింప రాదయా
మతము ప్రాణనాడి - "మంచి మనసు".

పూజా పుష్పాలు

ఈశ్వరునకు - ఏవి ఇష్టమో పుష్పాలు?
పూజ కెన్న దగిన - పువ్వు లేవి?

ఇంద్రియార్జవమ్ము - ఏకైక పుష్పమ్ము,
భూతదయను మించు పువ్వు లేదు;

జ్ఞాన మొక్క పువ్వు - ధ్యాన మింకొక పువ్వు;
తావి తరుగ నట్టి పూవు - ఈవి;

సత్య మనెడు పువ్వు - సర్వదా శ్రేష్ఠమ్ము,
క్షమకు సాటి పువ్వు - క్షమయె సుమ్ము;

చెట్ల మీద కాక - చిత్త వృత్తుల లోన
పూచి నట్టి పూల - పూజ లేక,

దివ్య మంత్ర పుష్ప దీప ధూపాలతో
తృప్తి చెంద బోడు - దేవు డెపుడు

యోగము

కాదు యోగ మనిన - కసరత్తు గరిడీలు
పుడమి లోన పూడ్చబడుట కాదు;
గాజు ఇనుము తినుట - రాజయోగము గాదు;
మనసు నిగ్రహించు మహిమ గాని.

కాదు యోగ మనిన - గడ్డాలు మీసాలు,
పసుపు కావి పట్టు బట్ట కాదు;
వేద శాస్త్రివాద వైదుష్యమా ? - కాదు,
"ఒడలితోడ ముక్తి" - యోగ మనిన.

యోగ మనిన - ఎట్టి ఉద్యోగమందైన
దీక్ష తోడ కూడు దక్షతసుమ;
మెరయు యోగ మందు - స్థిర తటిల్లత ఓలె,
కర్మ సామరస్య కౌశలమ్ము.

అద్వైతము

కుత్సితుండు చూపు - కుహనా వినయ మేల?
గర్వ గరిమ అంత కంటె మేలు,
దర్పము కొరకైన - దానధర్మము లేల?
కొంత నయము - పిసినిగొట్టు తనము;
గుండె పండనట్టి పాండితీ ప్రభ లేల?
చదువుకొనని రైతు చాల మెరుగు,
మిడిసి పడెడి మేటి మేడ దొంతర లేల ?
చుట్టు గుడిసెలోని సుఖము లేక,
గుండె దడను పెంచు గొప్ప సంపద లేల?
కోర్కె లదిమిపట్టు కూలి మేలు,
పూర్ణ సుఖము లేదు - పూర్ణ దుఃఖము - లేదు
ద్వంద్వ బద్ధమైన ధరణి మీద;
నిండి యుండు జగతి - ఖండ సత్యాలతో
స్థిర తటిత్తు లేదు సృష్టి లోన
మెలగ వచ్చు దొరలు - మిథ్యా జగత్తులో
ఆత్మ వంచనమ్ము నరయ లేక,
అనుభవించు గాత అద్వైత భావంబు
మాయ తెరలు తొలగి మనిషి తుదకు.

పడుచుదనము

గున్న మావి చెట్ల కొమ్మపై - కోకిలల్
గొంతు నెత్తి కూయు కొసరి కొసరి,

దివిని భువిని గలుపు తెలియేరుగా తోచు
తొలియుషస్సుల సొరు తళుకు బెళుకు,

ప్రొద్దు పొడుపు పూల పొత్తిళ్ల మంచులో
విరియు - వేల కొలది వేల్పు విండ్లు,

అలము కొనును - దెసల మలిసంజ కెంజాయ
పూవుటెదల పసిడి పూత పూసి;

ఊగు కన్నె విరులు - ఉయ్యాల జంపాల
గాలి పొరల పైన తేలి యాడి,

కమ్మ తెమ్మెర చిరు కౌగిలింతలలోన
చిందు మొగ్గ లెల్ల చిలిపి సిగ్గు,

పలుకరించు ప్రకృతి - కలికి నవ్వులు చింది
పచ్చ తోరణమ్ము పైన పొంచి,

దూరి పద్మ వనుల - తుమ్మెదల్ - జతగూడి
మధువు గ్రోలు - ప్రొద్దు మరచిపోయి;

నిదుర మ ని - పెట్టు - మదిరాక్షి రేసాని
చందమామ దొరకు చక్కిలిగిలి;

అక్షతలను చల్లు - నక్షత్ర కూటముల్
తీగ - చెట్లు మెడను కౌగిలింప;

పేరుటడవి - పెద్ద పెండ్లి పందిరి యౌను
జంట బ్రదుకు పక్షి సంతతులకు,

గున్న పావురాల గుసగుసల్ రవళించు
కలలు గనెడి కన్నె కంఠమందు;

పడుచుదనపు వేడి పాల పొంగుల తోడ
వలపు గుండెలోన మొలక లెత్తు,

క్రొత్త మిసిమి తోడ - క్రొత్త నెత్తావితో
వెల్లి విరిసి తోచు - విశ్వ మెల్ల;

కొమ్మ కొమ్మలందు రెమ్మ రెమ్మల యందు
ఆమని మిసమిసలు అలము కొనును,

సృష్టి యెల్ల - మధుర శృంగార సంగీత
తన్మయత్వ మందు తాండవించు.

అష్టావధానము

ఆంధ్ర భాష నున్న దష్టావధానమ్ము
వేరు చోట లేదు వెదకి చూడ;
తెలుగు తళుకు బెళుకు - స్థిరతటిల్లత లోలె
విశ్వమెల్ల వెల్లివిరియ జేయు.

అవని పుట్ట వచ్చు - అష్టావధానియై
చావరాదు అట్లె జగతి యందు;
కావ్య సృష్టి చేసి - కవి చిరంజీవియై
బ్రదుకదగును - వెలుగు బాట వేసి.

స్వధర్మం

నీటియందు పుట్టి - నీటిలో జీవించు,
జలము నందె - చేప - చావ గలదు,
పాలు నీటి కంటె మేలైనవే గాని
బ్రతుక గలదె చేప పాల యందు?

పుట్టు భూమి పైన భూమిపైననె గిట్టు
బ్రదుక వలెను మనిషి వసుధ పైన
మనిషి బ్రదుక వలెను - మనుజ సంఘమునందె
చేతనైన మంచి చేయదగును.

సత్యం పద

మనిషి దేహ శిల్పమునకు నప్పుదు - బొంకు,
జంకు గొంకు లేక బొంకు లేదు;
కంపమొదపుచుండు - కంఠ స్వరము నందు
కాలుచేతు లందు కనుల యందు.

మొండితనము గొప్ప గుండె నిబ్బరమున్న-
అటమటించుచుండు అంతరాత్మ;
ప్రత్యవయవమడరి ప్రతికూల సాక్షియై
బుగ్గిలోన గలుపు - బొంకు పరువు

మనసు సుడులు తిరుగు - మాటమాటకు మధ్య
బొంకు తరచు చచ్చు పురిటి యందె;

అరయ నరుల కాయురారోగ్య భాగ్యముల్
తరుగు - బొంకు - పలుకు తరుణమందె.

పుడమి లోన లేదు - బొంకుగాచెడి ప్రజ్ఞ
సులువు నిజము పలుక శుభము సుమ్ము;

విద్య – విద్య కొరకే

నిర్వికల్పముగను – నిష్ప్రయోజకముగా
వెల్లివిరియు గాక – విద్య లెపుడు,
అభ్యుదయము గోరి – ఆర్జించుచో – విద్య
వింత వర్తకమ్ము – వెర్రి తనము.

తెచ్చు గాక ధనము – వచ్చు గాక యశస్సు
గౌరవమ్ము పదవి కలుగు గాక,

అమరు గాక – పెక్కు వ్యవహార లాభాలు
చదువు చదువు కొరకె చదువ వలెను.
చదువు వలన కలుగు స్వచ్ఛంధ సంస్కృతి
జ్ఞాన సానుభూతి చాలు చాలు
విద్య – మాత్ర దేవి – వెలయాలు కాదురా,
విలువ కట్ట రాదు విద్య కెపుడు.

గుండె దున్ని వెలుగు పండించు కోసమే
చదువు – వెలకు గాదు – చదువు కొరకె;
లెక్క గట్టి – పొట్ట కక్కూర్తి కోసమే
విద్య నేర్చువాడు – వింత పశువు.

నోరు

నాల్క యేమి చెప్పు? నాట్య విన్యాసముల్
చెవులు ముక్కు కనులు చెప్పు - కవిత

కవిత ఆగు చోట గానమ్ము మొదలౌను
పదము దాటి - స్వరము పరుగు లెత్తు,

నిజము - నోరు కంటె నీచమైనది లేదు
మనుజ హావ భావ మర్మ మెరుగ;

జారవచ్చు - కాలు - నోరు జారగ రాదు
నిండు కుండ తొణకకుండ నుండు,

అసలు మాట లెల్ల - అధిక ప్రసంగాలె,
మౌన మరయ ఋషుల మాతృభాష.

ఓర్పు తెలివి తేట లొడుపు గాంభీర్యమ్ము
మహిమ లెన్నో గలవు మౌన మందు

మనిషి మానసిక సమాధిలో - యోజనల్
పొదుగ బడును పెదవి కదలనపుడె.

కన్నులు

కనులు దిద్ద గలవు - ఎన్ని వంకర లైన
మొగము నందు - మేను ముడత లందు
వెల్లివిరియు కనుల విశ్వ చైతన్యమ్ము
కన్ను - నాట్యకళకు - గరిమ నాభి.

దీవనలుగ మార్చు - తిట్లనైనను గూడ
కరుణ జాలువారు కన్నుదోయి,
గ్రుచ్చగలవు - కనులు - గురిచూచి గుండెలో
పరిమళించు పుష్ప బాణములను,
కనులు మాటలాడగల వనర్గళముగా
పెదవి మూగవోయి కదల నపుడు,
పొగడ - గలవు కనులు - తెగడుచుండగ నాల్క,
వెక్కిరింప గలవు - వేడ - గలవు,
కవిత పుట్టు - వేడి కన్నీటి బొట్టులో
విప్పి ఏడు పురుల వేల్పువిల్లు;
కాల్చగలవు - కనక కటక దుర్గము లెల్ల
కడుపుమాడువాని కంటి మంట
నవరసరుచిరమ్ము నయనావధానమ్ము
అన్ని అవయవాల కన్ను మిన్న.

వైద్యశాల

ప్రప్రథమ చికిత్స - ప్రాచీన వైద్యమ్ము
మేటి మందు ఏది ? నేటి వరకు,
మనిషి అలరు నట్లు - మంచి మాటలు చెప్పి
మనసు కుదుట బరచు నెనరు - నేర్పు.

మందు లెన్ని యున్న - మరణంబు తప్పునా?
పుట్టి నట్టి వారు - గిట్టగలరు,
సానుభూతి వలయు - సాటి మానవులపై
వైద్య వృత్తి లోని వారి కెల్ల.

మంచి మందు లేదు - మందహాసము కంటె
వైద్యు డెంత గొప్పవాడు గాని,
అవని మందు లెల్ల - అనుపానములు సుమ్ము
అసలు సిసలు మందు - సానుభూతి.

ఆట

ఉడకబెట్టి మనసు - ఉద్రేకమును బెంచి
కోప తాప పీడ గుబులు కొలుపి;
బ్రదుకు కంటె - "క్రీడ" - భారమ్ము కారాదు
ఆట - అచ్చమైన హాయి కొరకె.

ఆట కూర్చగలదు - ఆయురారోగ్యముల్
బొందె తోడ ముక్తి పొందు పరచి,
క్రీడ - గెలిచి నపుడు - ఓడినప్పుడు గూడ
ఉభయ తారకమయి ఉద్ధరించు.

వ్రత భంగము

నీతి ధర్మగతులు - నిత్య చైతన్యముల్
పరిమితములు గావు వ్రతము కెపుడు,
స్వార్థరహితమైన - వ్రతభంగమే మేలు
బ్రదుకు కాటపట్టు - పట్టు విడుపు

గురువుగారు

బోధ చేయు గురుడు - పొగ గొట్టమా ? కాదు,
సుత్తి గాడు ! వాడి కత్తి గాడు !
రాపిడులకు నిప్పు రవ్వ లీనెడు రాయి
జ్ఞాన బీజములకు - వాన జల్లు.

చేయ నేల గురువు ? చేయు శక్తిని గూర్చి
శిష్య తతికి బోధ చేయు - చాలు;
పొడువ లేదు - మూల పడియుండు ఒక చోట
బండ రాయి - కత్తి పదను పెట్టు.

నీడ వోలె - శిష్య నిజమైన గురువైన
గొప్పకొరకు వెంట త్రిప్పుకొనడు;
శిష్యుడైనవాని - స్వీయ దాస్యమునుండి
తరిమి వేయువాడె - గురువు గారు.

చట్టాలు

పుట్టె సంఘమందు చట్టాల కట్టడుల్
నీతి కొరకు ! న్యాయ నిరతి కొరకు !
శాసనమ్ము లురిమి జడిపించు ప్రజ నెల్ల
పొందవచ్చు కొద్ది మంది హాని.

చట్టమునకు - ఆత్మ స్వచ్ఛమౌ న్యాయమే
ఎన్ని జన్మ లైన ఎత్తవచ్చు;
దేశ దేశ మందు దేహవర్ణము వేరు;
మొగము కప్పు మేలి ముసుగు వేరు.

మాసిపోవు న్యాయ శాసన స్మృతులలో
నివురు గప్పుకొన్న నిప్పు లేరి;
తేజరిల్లు నేడు - దేదీప్యమానమై
విశ్వమందు - గొప్ప విద్యలెన్నో.

ఉదయము

తిరిగినాను నేను - తిండి తీర్థము లేక,
నిలువ నీడ లేక - నిదుర లేక;
బ్రదికినాను - నేటి ఉదయమ్ము కోసమే,
రేలు గడిపినాను - వేల కొలది.

చేరినాను తుదకు - దూరభారము మీరి,
వీథి గడప దరికి - వేగుబోక;
దూరి యుండి రచట - దొడ్డి గుమ్మము నుండి,
ముందు గానె - కొంతమంది - రాత్రి.

నాకు చోటు లేదు - లోక సంగ్రహమందు,
కాని - కలలు గనెడి కనులు గలవు;
వెల్లి విరిసి నట్టి - వెలుగులో లీనమై,
నింగి గొడుగు క్రింద - నిలువ గలను.

కవితా ప్రభాస – ముక్తకములు

నాలుక

ఉండు నాల్క – తిరుగుచుండి – ముప్పది రెండు
పండ్ల మధ్య – కీడుపాటు లేక;
సంఘ మందు – మనిషి – స్థాన జాగృతి గల్గి,
మేర మీరకుండ మెలగు గాక.

కవులు

కలలు గనెడి కవులు – కార్యశూరులు గారు;
కార్యనిపుణు లెల్ల – కవులు గారు;
కర్మయోగి యైన – కవి వరుండున్నచో,
అవతరించు – అవని కభ్యుదయము.

లౌక్యము

కత్తి ఒరను చూపి – మెత్తగా మాటాడి,
ఉరుము లురిమి, మెరసి ఊరకుండి,
పడగ నెత్తి చూపి – భయపెట్టి, బుసకొట్టి;
పొందవచ్చు – జయము – పోరకుండ.

తోడు చుక్క

కాగి – కాగి – పాలు – గడ్డ మీగడ కట్టు,
పిదప మారిపోయి – పెరుగు అగును;
చదివి చదివి, పొందు – జ్ఞానమ్ము – విద్యార్థి
గురువు – "తోడు చుక్క" – పెరుగు నందు.

నిజము

లోతు ఎక్కు వున్న నూతిలో - పడిపోయి,
"నిజము" కానుపించు - నీరు తేర;
ప్రజలు - తొంగిచూచి - ప్రతిబింబ రూపమే,
తరచు నిజ మటంచు తలపవచ్చు.

పేకాట

గుడ్ల గూబ వోలె - కూర్చుండి - పేకాడి
చెరుప నేల ? ఇరుగు పొరుగు గూడ ?
కూర్కు లేక - రేయి - కోలుపోయిన శక్తి
బాగు పరచలేదు - పగటి నిద్ర.

చెవులు

చెప్ప జాల రెవరు - ఒప్పుగా చాడీలు
వినెడి వారు లేక - వీను లొగ్గి;
చేయవద్దు - నీదు చెవులు - గోరీలుగా
పాతిపెట్టు కొరకు - పరుల పేరు.

గుర్తింపు

గొప్ప వారు - నిన్ను - గుర్తింపకున్నచో,
కుమిలిపోకు - నీకు కొరత రాదు;
నింపు కొనుము - వెలుగు - నీ గుండె నిండుగా,
ప్రొద్దు పొడుపు పువ్వు వోలె - బ్రతుకు.

ఐన్‌స్టీను

సానుభూతి లేదు - సైనికుండన నాకు
కదసు త్రొక్కు రెండు కాళ్ల పశువు;
ఉన్నది గద - అతని కొక వెన్నెముక - చాలు;
వాడ నట్టి మెదడు వాని కేల ?

న్యూటను

పుడమి యెల్ల - నన్ను - పొగడవచ్చును గాని,
విన్నవింతు - వినుడు - నన్ను గూర్చి;
నేను బాలకుడను - జ్ఞానాబ్ధి దరిచేరి
కొన్ని గులక రాళ్లు - కూర్చుకొంటి.

ప్రజాస్వామికము

చిన్న చేప - రేపు - శ్రీ తిమింగల మౌను;
కుక్క - సింహపీఠి నెక్క వచ్చు;
ఏమి చెప్పగలము - ఇది - ప్రజాస్వామ్యమ్ము;
అడవి నేలవచ్చు - గడుసు నక్క.

ప్రతిభ

ప్రతిభ - తరచు - బయటపడు స్వయంప్రభ లీని;
దాగియుండ లేదు - ధరణి లోన;
మట్టి లోన పొరలు - మాణిక్యమును గాంచి
గుర్తుపట్టువాడు - గొప్పవాడు.

రాజకీయాలు

చదువు - అనుభవమ్ము - శక్తి సామర్థ్యముల్
అన్ని శాఖ లందు - అవసరమ్ము;
జయము గాంచు కొరకు - స్వార్థ మొక్కటి చాలు
రాజకీయ నాట్య రంగ మందు.

భార్య కనులు

భర్త తెలివి తేట - ప్రతిభా విశేషముల్
కానుపించు - భార్య కనుల చివర;
ఛాత్ర గణము చూపు - చాకచక్యము నందు
గురువు గొప్పదనము - గోచరించు.

ఉపన్యాసము

వ్రాత యేమి చేయు? పాత గోరీలలో
మృత శరీర మట్లు - చితికిపోవు;
దేశ చరిత మార్చి - తీర్చి దిద్దున దేది?
బ్రతికి యున్న నేత పలుకు మాట.

ఆశ

ఆశ యెత్తు ఎక్కు వాకాశమున కంటె
ఆశ - మానవులకు ప్రాణ నాడి;
తరచు ఆశ - కొరవి దయ్యాల వేటయే,
కాని - జయము ఆశ కడుపు పంట.

సున్న

మిత్ర వరుల తెలివి - శత్రు మూర్ఖత్వమ్ము
అనుచర సహచర్య - త్యాగ నిరతి;
తీసివేసి - నేత తేజస్సులో నుండి
సూక్ష్మ దృష్టి చూడ - "సున్న" - మిగులు.

నిర్ణీత కాలము

ప్రగతి కోరు ప్రజల - ప్రథమ కర్తవ్యమ్ము
కాల మాన నియతి పాలనమ్ము;
నేత - మీర రాదు - నిర్ణీత కాలమ్ము,
పాడు చేయ రాదు - ప్రజల ప్రొద్దు.

అపజయము

జయము వచ్చినపుడు - జంకుగొంకులు లేక,
పోరవచ్చు - పారుబోతు గూడ;
అపజయమ్ము వచ్చు నపుడు - జంకక నిల్చి
పోరు చుండు వాడె - వీర వరుడు.

అవినీతి

సులువు - బ్రదుక వచ్చు - శుంఠ యైనను గూడ
నీతి తోడ - ధర్మ నిరతి తోడ;
ఎవడు - బ్రతుక గలడు? అవినీతిలో మున్గి
సాటి లేని తెలివి తేట లేక ??

వేళ్లు

కొట్టి లాభమేమి - చెట్టు కొమ్మలు కొన్ని ?
క్రొత్త చిగురు పట్టి - కోలుకొనును;
వేళ్లు నరుకకున్న - విష వృక్ష మెటు చచ్చు?
పట్టు నెరిగి - వాత పెట్టవలెను.

శాసన కర్త

వసుధ నేల గల్గు - అసలు శాసన కర్త
కవి వరుండు గాక ఎవడు గలడు ?
గుండె దున్నివేగ - పండించ గల రైతు
కొత్త విలువ లేరి - కుప్ప వోయు.

పక్షి

నిలువ వచ్చు - చేరి - నేలమీదను వ్రాలి,
నడువ వచ్చు తప్ప టడుగు వేసి;
ఎగుర గలదు పక్షి - గగనమ్ములో నంచు,
ఉన్న గౌరవమ్ము - ఊడిపోదు.

ఏకాకి

గుంపు లోన చేరి - కోలుపోవకు - గుర్తు,
నీ స్వరూప మెపుడు నిలుపు కొనుము,
లోక మందు నిలిచి - ఏకాకిగా నైన
పెంచు కొనుట మేలు మంచితనము.

బ్రతుకు తెరువు

నీటి లోన మనిషి - నివసింప వలె నన్న
చెప్పవయ్య - ఏమి చేయ వలెను?
మసల గలుగ వలెను - మొసలి గుంపుల మధ్య,
చెలిమి చేయు నట్టి తెలివి గలిగి.

అవకాశములు

అభ్యుదయము చెందు - అవకాశములు గల్గి,
పైకి వచ్చి మరుగు పడిన ప్రజ్ఞ;
విత్తనమ్ము - గొప్ప వృక్షమ్ముగా మారు,
నీరు దొరుక - మంచి నేల దొరుక.

వాద గోష్ఠి

రవ్వ నిదుర చెందు - రాయి లోపల దాగి
మేలు కొనక - యుగ యుగాల వరకు;
రవ్వ - బయట పడును - రాళ్ల రాపిడి వల్ల
వాద గోష్ఠి - వెలికి వచ్చు - "నిజము".

ప్రజాస్వామికము

దేని వలన దెబ్బ తిను - ప్రజాస్వామ్యమ్ము?
స్వార్థ నేత పనుల వలన గాదు,
కనుల ముందు జరుగు క్రౌర్యమ్ము - తిలకించి,
ఊరుకొనెడి - మంచి వారి వలన.

నిఘంటువు

"కాల మితిని" - తెలుపు గడియారమును బోలు
ఏ నిఘంటు కోశ మైన గాని;
ఒక్కటైన - అసలు నిక్కమైనది గాదు;
ఒకటి ఎట్టి దైన ఉన్న - మేలు.

సెలవులు

సెలవు లనిన ఏమి? వలపు తీపిని బోలు;
సుఖము కొరకు ఎదురు చూడవచ్చు,
అనుభవించు నపుడు - ఆస తీరదు గాని
విడిచి నపుడు కలుగు - విరహ బాధ.

"పెండ్లి"

వేడ్క కాదు - "పెండ్లి" - వేడంబరము కాదు,
పిల్ల జెల్ల లుండు ఇల్లు కాదు,
ధర్మ నిరతి తోడి - దాంపత్య యజ్ఞమ్ము
వేయి కొక్క చోట - విజయ మబ్బు.

ధర్మము

"ఎచట ధర్మ ముండు - అచటనే జయముండు";
అనెడి నమ్మకమ్ము మనల నడపు;
న్యాయ బలము తోడ - ఆదర్శ బలముతో
లెండు - రండు - ఎదురు లేదు - మనకు.

సత్యము

జగతి యెల్ల - ఖండ సత్యాలతో నిండె,
లేదు పరమ సత్య మేది లేదు;
సత్య మనిన ఏమి? సాంఘిక భ్రమలలో
సమ గరిష్ఠ భాజక మితి గాక ?

మార్పు

స్నాన మాడ లేడు - నరుడొకే నదిలోన
రెండు సార్లు - మారుచుండు జగతి;
చదల ఒక్క రీతి - ఉదయించు సూర్యుండు,
క్రొత్త వాడు సుమ్ము - రోజు రోజు.

ఝంకృతి

పెదవి ముద్దు గొనెడి - సదవకాశము లేక
ఆలపింప వచ్చు - అమృత కవిత;
తేటి పువ్వు చేరి - తేనె ఆనని వేళ
ఝంకరించు - దెసలు సంచలింప.

గొప్ప నిజము

అర్ధ రాత్రి గడచె - అది శీత కాలమ్ము,
గొప్ప నిజము నాకు - గోచరించె;
గుప్తమైన వేడి - గుండె లోతుల లోన,
మనిషి దాచి యుంచుకొను నటంచు.

తోట బడులు

చిన్న బిడ్డ మెదడు - చిన్నారి విరిమొగ్గ;
వేయి నెమలి పురుల వేల్పు విల్లు,
తోట బడుల చదువు - ఆట పాటుల తోడ
ఎల్ల లెదుగజేయు - ఎదల చదల.

వేదాంత విద్య

విమల విద్య మధ్య - విశ్వాసముల మధ్య
సంధి చేయు నట్టి - సంజ చాయ,
వెలయు - విశ్వమందు వేదాంత విద్యయై;
మెదడు మేడపైకి - మెట్లు గట్టి.

మంచి మనసు

గొప్ప తనము గాంచి - గుర్తించు వెంటనే
మంచి మనసు ఉన్న మనిషి యైన;
వెన్న పంచ మేలు - విసము గ్రక్కుట కంటె;
గుండె - పండ వలెను - క్రుళ్ళరాదు.

మానవత

ఆస్తి పాస్తు లేల? ఆడంబరము లేల?
చదువు లేల? గొప్ప పదవు లేల?
చాలు - జాలి గుండె - సంతోష సంతృప్తి,
చాలు - మానవతకు - చాలు చాలు.

వెరసి మనిషి

విద్య - కళలు - వివిధ విజ్ఞాన శాస్త్రములన్
వేరు వెరవులందు వింగడించి
సగటు మనిషి గూర్చి - సలిపె సిద్ధాంతముల్;
వీటి దాటి మిగులు - వెరసి మనిషి.

వృక్షో రక్షతి రక్షితః

రక్ష సేయు ప్రజల - రక్షించు వృక్షముల్
పచ్చదనము నిచ్చి - పండ్లు నిచ్చి,
నీతి నేర్పి - విమల వాతావరణ కూర్చి,
తిన్ననైన బ్రదుకు - తీర్చి చూపి.

సత్యం

సత్య మెపుడు వెల్గు - సర్వతోముఖముగా
అన్ని తెగల కుండు - హ్రస్వ దృష్టి
కాంచ గలదె - కప్ప - గగన వైశాల్యమ్ము,
కూరుచున్న యెడల - కూపమందు.

గడ్డి కొడ

గార్దభమ్ము నెక్కి - గడ్డి కొడను చూసి
ఎంత దూరమైన ఎవడు వెడలు?
రాజకీయ నాట్య రంగస్థలము నందు,
అతని చాకచక్య మరయ దగును.

భోగి – యోగి

పాప జలధి మధ్య – ద్వైపాయనుండుగా
పుణ్యమూర్తి యెవడు పుట్ట లేడు;
అవని యందు లేడు – ఆగర్భ దనుజుండు;
భోగి – యోగి నరుని బొమ్మ – బొరుసు.

ఉయ్యాల ఊపులు

చాలు చాలు – నేను – జగదేక ఋషి గాను;
కావు – పరమ పాపి వీవు గావు;
ఊర్వి జనుల యెడద – లుయ్యాల ఊపులే,
చూడ బ్రదుకు వెలుగు నీడ మధ్య.

హలము – కలము

గుండె దున్ని – కలము – పండించు జగతిలో,
పాలము పండుచుండు – హలము వలన,
వెల్లి విరియ గలదు – విశ్వ కల్యాణమ్ము;
హలము కలము వియ్య మంది నపుడు.

బ్రదుకు

ప్రాప్తమైన పాత్ర – బ్రదుకు నాటకములో
వేషధారి వగుచు వేయవయ్య;
రక్తి కట్టు నట్లు – రంగస్థలముపై;
పొందగలవు "ముక్తి" – బొందె తోడ.

నేడు

హ్రస్వ దృష్టి - నేడు - హాస్యాస్పదము కదా !
విరిసె జగతి - "జ్ఞాన విప్లవమ్ము";
గుడ్లగూబ కాదు - కూపభేకము కాదు;
నరుడు విశ్వ పౌరవరుడు - నేడు.

కలలు - క్రియలు

కలలు గనును రాత్రి - కార్య శూరుడు పవల్,
మెదడు గుండె కలియ మేటి నేత;
కలలు క్రియలు గలియ - కలుగు అభ్యుదయమ్ము
క్రియలు లేని కలలు - కీడు తెచ్చు.

కైవల్యము

విద్య - కళిత కళలు - విజ్ఞాన శాస్త్రమ్ము
ఒక్క చోట కలిసి యుండ వెపుడు;
కలిసె నేని - కలుగు కైవల్య మచటనే;
దిగ్ దిగంతరాలు - తేజరిల్లు.

ఉత్త చేయి

తరచ - వెన్న వచ్చు - పెరుగు మీగడ కుండ;
చిలికి లాభ మేమి జలము నింపి?
ఉత్త చేయి చూపి - ఊరించి మాటాడి
నేడు నాయకుండు నెగ్గగలడె ?

అభిరుచి

కష్ట మేమి కాదు - కాలమ్ము - దూరమ్ము,
అలపు - విసుగు - బరువు తొలగిపోవు;
మండు టెండ - తోచు - పండు వెన్నెల వోలె,
ఇష్ట మైన పనికి - ఏగు నపుడు.

జాగ్రత్త

చాల దూర ముండు - జాగ్రత్త - జాగ్రత్త;
దేవళమ్ములకును - దేవునకును;
గుడుల కట్టుబాట్ల సుడి గుండముల చిక్కి,
చెంద లేడు "ముక్తి" - జీవు డెపుడు.

సంతృప్తి

కామధేను వుండి - కల్ప వృక్షము లుండి;
అమృత ముండి - కామ గమన ముండి;
స్వర్గ మందు ప్రజలు - సంతృప్తి పడ లేరు;
నరక బాధ గూర్చి యెరుగ నపుడు.

మనిషి

చిన్మయుండు - "మనిషి" - మృణ్మయుండా? కాడు!
సృష్టి కపర సృష్టి చేయు వాడు;
కలదు - స్వేచ్ఛ - స్వీయ కర్తవ్యముల యందు;
మంచి చెడుగు లెరుగు - మనసు - గలదు.

పిప్పి పన్ను

గొప్ప శుభము - వెనుక గోయి త్రవ్వెడు వాడు
వెడలు నెడల తన్ను విడిచి పెట్టి;
పాడు పిప్పి పన్ను - ఊడిపోవుట మేలు
సుఖము గలుగు - నోరు శుభ్ర మగును.

విప్లవాగ్ని

ప్రజల హృదులలోన - పరిపక్వ పరిధిలో,
వెల్లి విరియు నట్టి - విప్లవాగ్ని;
ఏ నియంత గాని - ఏ సైనికులు గాని
ఆర్పివేయ నేర రవని లోన.

ముసలి మిరియము

తరచి చూడ - ముసలి మిరియమే - మేల్గాదె,
పడుచు జొన్న కంటె - పుడమి పైన?
ఘాటు లోన - విలువ పోటీల ధాటిలో;
రాటు పోటు బ్రదుకు వేట లోన.

కీడు - మేలు

రైతు - వాన కొరకు - ప్రార్థించు పలుమారు,
నావికుండు - వాన నేవగించు,
కలుగు కీడు - మేలు కలుగు - వేరొక చోట,
చెడుగు లేని మంచి పుడమి లేదు.

రూసో

జన్మ చేత - "జనులు" - సౌశీల్య వంతులే;
పాడు చేయు చుండు - పరిసరములు;
అంతరాత్మ బోధ - ఆలకించుట మేలు;
సమత - స్వేచ్ఛ - మనుజు జన్మ హక్కు.

సంశయాత్మ

సాలెవాని కండె - సంశయించెడి ఆత్మ;
పడుగు పేక మధ్య - పరుగు లెత్తు;
నమ్మకమ్ము కుదురు నరు డుండు నెమ్మిమై;
నిండు కుండ లోని - నీరు ఓలె.

దానము

దాత కంటె - గొప్ప ధనవంతుడే లేడు,
పిసినిగొట్టు కంటె - పేద లేడు;
దైవ భక్తి లేదు - దాన మిచ్చుట కంటె
గొప్ప దేది? జాలి గుండె కంటె !

ఆయుర్దాయము

అభ్యుదయము కాదు - ఆయుస్సు పెరుగుచో;
ముసలితనము పెంపు - మురిప మేమి?
పడుచుదనము గడువు - పొడిగింప బడినచో
సగటు వయసు పెంపు - సార్థకమ్ము.

మృత్యువు

మందు లతని జబ్బు - మాన్ప జాలవు - సుంత;
స్వేచ్ఛ - అతని కాట విడుపు కాదు;
లేదు కాలమునకు - ఓదార్చ గల శక్తి;
మృత్యు వొకటె - అతని మిత్ర మగును.

నీతి బోధ

శాల నున్న యెడల - జవనాశ్వమై తోచు
తత్త్వ శాస్త్ర నీతి ధర్మ బోధ;
ఎక్కి స్వారి చేయ - డొక్కు గాడిద సుమ్ము;
పారలేదు - నూరు బార లైన.

కర్తవ్యములు

స్వీయ సుఖము వీడి - చేయు కర్తవ్యముల్;
పరమ పావనములు - బ్రదుకు నందు;
కలవు ఇంట బయట - కర్తవ్య బహుళముల్;
త్యాగ మంతరాత్మ - ధర్మమునకు.

సమయ సారిణి

కదుప ప్రజ్వరిల్లి - కట్టె లెల్లనుమండు;
నివురు గప్పు కొనెడి - నిప్పు రగిలి;
చదువు లందు గూడ - సమయ సారిణి కూర్ప్ము,
మెదడు కదిపి కుదిపి - మేలు చేయు.

వేదాంతము

విజయ వేళ - వెడలు - వేదాంత విక్రమా
దిత్య చక్రవర్తి - తేరు నెక్కి !
అనునయింప - ప్రజల - అపజయంబుల వేళ
అతడు - వినయ దాసి - మతము నంపు.

తన్ను గూర్చి

మనిషి తన్ను గూర్చి - మాటలాడుట - తప్పు;
తాను పొగడుకొనుట - దర్ప మగును;
నటన - తెగడు కొనుట - నమ్మ నేరరు ప్రజల్;
గొప్పదనము నొరులు చెప్పవలెను.

అవసరము

కండ పుష్టి కొరకు - కసరత్తు కావలె;
చదువు - అవసరమ్ము - మెదడు కొరకు,
అవసరమ్ము - గాన మంతరంగమునకై;
ధ్యాన మవసరమ్ము - ఆత్మ కొరకు.

పాత దెయ్యము

తెలియ నట్టి క్రొత్త దివ్యర్షితో చేరి
కోరి పాత్తు కలుపుకొనుట కంటె,
తెలిసినట్టి పాత దెయ్యమ్ము తోడనే,
కలసి మెలసి మనుట సులువు - సుఖము.

ఎన్నికలు

ఎట్లు ఎన్ని కగుట? - ఇది - ప్రజాస్వామ్యమ్ము!
నెగ్గలేనివాడు - నేత గాడు;
ఏరు లేని చోట - వారధుల్ నిర్మింప,
ప్రతిన చేయు టిపుడు "రాజనీతి".

సువర్ణ సూత్రము

విన్నవింతు - విశ్వ వేదాంత సారమ్ము;
వినయ మొప్ప - వినుడు - వీనులొగ్గి;
బ్రదుకు నందు - తనకు ప్రతికూలమౌ దాని
నరుడు చేయరాదు - పరుల కెపుడు.

సహకారము

సగము బలము నిచ్చు - సంతోషమే యున్న,
కొండ పిండి చేసి కొట్ట వచ్చు;
సగము బరువు తగ్గు - సహకారమే యున్న,
పంచుకొనెడి బరువు - బరువు కాదు.

నవ్వు

బ్రదుకు బీట ముడులు - పలు సమస్యల సుడుల్
చీల్చు కత్తి - నరుని చేత గలదె?
చీల్చి వేయ - ఎట్టి చిమ్మ చీకటి నైన
నరుని కాయుధమ్ము - నవ్వు - సుమ్ము.

కృషి

సార్వ భౌమ పదవి - సామ్యవాదము నందు
స్వేద బిందువునకు - చెందు గాత !
కరువు కాటకాలు - దరిరావు - కృషిచెంత;
జయము - దిగ్విజయము - జయము శ్రమకు.

చరిత్ర

చరిత - శాస్త్రములకు - "సత్యమే" - ఆత్మయౌ;
సాహితీ ప్రగతికి - చరిత - తల్లి;
తెలిసి కొనిన - చరిత - దృశ్య వేదాంతమే;
ముగ్గురమ్మల కది - మొదటి తల్లి.

ధైర్యము

ఒక్క చోట - నిలిచి యుండు - ధైర్యము లేక,
పిరికి వాడు - ముందు కురుక వచ్చు;
వీరు డెపుడు - బ్రదుకు పోరాటముల యందు,
చెదర కుండ నిలిచి కదల కుండు.

తెగువ

వేల్పు లెల్ల వెరచి - వెనుకంజ వేయుచో,
ముందు కురుక వచ్చు - మూర్ఖు డొకడు;
సమయ సీమ నెరుగు శౌర్యమే - శౌర్యమ్ము;
పందతనము గాదు - ముందు చూపు.

స్వాతంత్ర్యము

స్త్రీలు వదల లేరు - శీలమ్ము నలవోక,
పరువు వదల లేరు - పురుషు లెపుడు;
వీడలేదు జాతి - స్వేచ్ఛ - స్వాతంత్ర్యమ్ము;
తమ కృతజ్ఞతా ప్రదర్శనమున.

సుభాషితాలు

మందబుద్ధి - వాడ - మసి బొగ్గుగా తోచు
గొప్ప సూక్తి - విలువ కోలుపోయి;
జ్ఞాని వాడినపుడు - మాణిక్యమై పొల్చు;
సూక్తి కాత్మ - సుప్రయోగ శుద్ధి.

నమ్మకము

స్థాన మేది? నిత్య చైతన్య జగతిలో,
కరడు గట్టు - నమ్మకాల కెపుడు??
నమ్మకమ్ము లేదు - నాకు - నమ్మకముపై;
స్వేచ్ఛ - ఎపుడు నాకు జీవ గర్ర.

కన్నతల్లి

సన్న జాజి కన్న - సన్నాయి లయ కన్న,
జున్ను గడ్డ కన్న - వెన్న కన్న,
నెమలి కన్ను కన్న - నిండు వెన్నెల కన్న,
కన్న మనసు సొబగు - సున్నితమ్ము.

కవులు

జగతి పోకడలకు - స్పందించు డెందమ్ము
కాగి - కరగి - కారి - కవిత యౌను;
బధిర సంఘమునకు - బహిరంత రాత్మలై;
కదల గలరు - కవులు - బ్రదుక గలరు.

సుడి గాలి పంట

నాటి నట్టి విత్తనాల బట్టియె - పండు;
పంట పొలము గాని - బ్రదుకు గాని;
కడగి గాలి విత్త - సుడి గాలి ఉప్పెనల్
పండు చుండు - తరచు - బ్రదుకునందు.

స్నేహము

కష్టతమము నడుప కర్తవ్య యంత్రమ్ము,
బిరుసు బ్రతుకు మరలు - తిరుగు కొరకు;
నింపుచుండ వలెను - స్నేహానురాగమ్ము;
ప్రతి విభాగమందు - ప్రతి దినమ్ము.

మైత్రి

అతిశయించ గలవు - ఆనంద సౌఖ్యముల్
చెంత నున్న యెడల - స్నేహితుండు;
తగ్గిపోవు కొంత - దైన్యమ్ము - దుఃఖమ్ము;
ప్రక్క, మిత్రు డుండి - పంచుకొనిన.

వాగుడు

చదువు లేదు - శక్తి సామర్థ్యములు లేవు;
ధనము లేదు - మంచితనము లేదు;
అరయ అంత కంటె - దురదృష్ట మేదయా?
పెదవి తరచు విప్పు - పిచ్చి గుబులు.

స్వాతంత్ర్యము

ఎన్ని యున్న - లేని యెడల - ఆరోగ్యమ్ము;
వ్యక్తి జీవితమ్ము - వ్యర్థ మగును;
ఎన్ని యున్న - లేని యెడల - స్వాతంత్ర్యమ్ము;
పొర జీవితమ్ము - పాడుపడును.

సొంత వల

బయట పడుట సులువు - పరు ప్రభావము నుండి
తెలిసియున్న వాడు - తెగువ తోడ,
తెలివి యుండి - సొంత వలలోన పడినచో,
బ్రోవ వలయు నతని దేవు డొకడె.

చీవాట్లు

నల్ల మందు - విసము - నాభి - పాషాణముల్
వాడరాదు తరచు - వైద్య వరుడు;
చెంపకాయ - తిట్లు - చీవాట్లు - బెత్తముల్,
తరచు వాడరాదు - గురువు గారు.

అనుభూతి

అవతరించ దెపుడు - అనుభూతి లేకుండ,
స్వచ్ఛమైన కవిత - జగతి యందు;
సహృదయులకు - 'కవిత' - స్పందించి కన్పించు,
జీవనాడి వోలె - చేతి కంది.

చుక్కాని

బలము మాత్ర మున్న - బ్రదుకులో సరిపోదు,
తెలివి తేట లుండవలయు, తోడు;
పక్కి తెడ్డు లుండి - చుక్కాని లేకుండ,
వెడలి - లాభ మేమి? పడవ నెక్కి.

కినుక

బొమలు ముడులు పడును - పొంగారు రక్తమ్ము,
గుండెకాయ వేగ కొట్టుకొనును,
కన్ను లెర్రబడును - కంపించు, ఒడలెల్ల;
కినుక వలన - తనకె, కీడు మూడు.

మౌనము

చిత్ర మది మర్రి నీడను చేరినారు!
పిన్న గురువును - శిష్యులు - పెద్దవారు !!
గురువు మౌనమే - వ్యాఖ్యాన భరిత మయ్యె !
శిష్యులకు నెల్ల - సంశయచ్ఛేద మగుచు.

ఎవరు నుడువ గలరు

పుట్ట మీది పాము - చెట్టుపై రాబందు,
కడలి నీటి మధ్య - కదలు పడవ;
పడుచు కన్నె పిల్ల కడ నున్న - యువకుండు;
వెడలు తీరు లెవరు నుడువ గలరు?

అభ్యాసము

ప్రతిభ ఉండవచ్చు - పాండిత్యమును చేరి
కవిత లందు - లలిత కళల యందు;
అనుదినమ్ము - సాధనాభ్యాసములు లేక
పరులు మెచ్చు "కీర్తి" - పడయరాదు.

దురదృష్టము

నరుల నావహించు - దురదృష్టముల యందు
చెప్ప నలవి కాని - చెడ్డ దేది?
మంచి తనము పైన - మానవత్వము పైన,
మనిషి నమ్మకమ్ము - మాయ మగుట.

క్రొత్తదనము

కలుగు మార్పు లెల్ల - కాలానుగుణముగా
అన్ని కళల తల్లి - అవసరమ్ము !
ప్రాతదనము పోయి - పరిణామ జగతిలో;
క్రొత్త దనము - ప్రగతి కొరకు - వచ్చు.

ఒప్పు

దూరవచ్చు "తప్పు" - దొడ్డి గుమ్మము నుండి,
కుంటి నడక, ప్రొద్దు గ్రుంకు నపుడు;
"ఒప్పు" - ఇంటి ముందు - ఓరవాకిలి గాంచి,
వెనుక కరుగ వచ్చు - వేగు బోక.

దారిలో

బడులు నేర్పు చదువు - బహు దూర యాత్రయే;
గమ్య మంత సులువు గాదు చేర,
విలువ గట్టు లేని విషయాలు - వేవేలు,
తరచు తారసిల్లు - దారి లోన.

సూర్యోదయము

ఈ ప్రపంచమందు - ఇపుడె యెచటనో,
సూర్యు డుదయ మందుచుండు గాదె !
ఇప్పు డిచట తోచు - ఈ కాళరాత్రియే;
ఇంక - తెల్ల వారు - ఇచట గూడ.

కర్మయోగము

సన్న్యసింపకుండ - సంకల్ప వాసనల్,
కావిగట్టువాడు - కాడు యోగి,
స్వార్థ ముడిగి - జ్ఞాని - సంసార మందుండి,
పొందవచ్చు - "ముక్తి" - బొందె తోడ.

త్రికరణ శుద్ధి

బ్రతుకు నందు - ఒక్క శ్రుతిలోన - ఏకమై,
తలపు - వాక్కు - కర్మ లలరి నపుడు,
కలుగు - పుడమి - పూర్ణ కైవల్య యోగంబు;
బొందె తోడ - "ముక్తి" - పొందు టదియె.

వాద తీవ్రత

బల్ల గుద్ది నొక్కి - వాదించ వద్దయా,
నీది న్యాయమైన - నిజమె యైన;
అపజయమ్ము గలుగ - అపకీర్తి తోడౌను;
విజయ మంది నపుడు - విలువ తగ్గు.

భజన

కావి గట్ట కుండ - గాండీవమును పట్టె
"గీత" - విన్న పిదప - క్రీడి - తెలిసి;
చేయలేదు భజన - చిరుత గజ్జెలు గట్టి
తాళ లయలు తప్పి - తాండవించి.

భగవద్గీత

కనలి - వదలరాదు - కర్తవ్యముల నెల్ల
మలిన మనుచు - లేక కలుష మనుచు;
అమరి యుండు - దోష మన్ని కృత్యములందు,
ధూమ మగ్ని లోన - దొరలు నట్లు.

విలువలు

నీరు పల్ల మెరుగు - నిజము దేవు డెరుంగు,
గడుసు దనము - పట్టు విడుపు లెరుగు;
విలువ మార్పు లెరుగు - విజ్ఞానవంతుండు;
అచ్చ మైన - ప్రేమ - అమ్మ యెరుగు.

సామరస్యము

ప్రాత దైన దెల్ల - బంగారమా? కాదు,
ఉత్త చెత్త కాదు - క్రొత్త దెల్ల;
మంచి - యెచట నున్న ఎంచి గైకోదగు
సామరస్య మందు - సత్య ముండు.

- కాళిదాసు

దీక్ష

"శక్తి లేమి" గాదు - సంకల్ప లోపమే,
తరచు కానిపించు - నరుల యందు;
దీక్ష మేలు - మేటి తెలివి తేటుల కంటె;
పొందవచ్చు - జయము - పూన్కి వలన.

అన్యతములు

అన్యతము లను గట్టి - అంగరక్షకులచే,
చుట్టు సత్య మెపుడు చుట్టబడుచు
రాజకీయ మందు - రక్షింప బడు చుండు;
చేను - ముండ్ల కంచె చేత ఓలె.

శిశువు

సకల వృత్తు లందు - శాఖోప శాఖల్ల
నేత యెవడు రేపు? నేటి శిశువు;
సంఘ మెల్ల - రేపు - సర్వనాశన మౌను,
"నేడు" శిశువు మేలు - చూడకున్న.

వింత ప్రణయం

వింత గావు - సఫల విఫల శృంగారముల్,
కూర్మి నొకరి నొకరు కోరు కొనిన;
పేర్మి తన్ను తానె - ప్రేమించుకొన్నచో !
వింత ప్రహసనమున కంతు లేదు.

మొండి వాడు

ప్రభువు కంటె గూడ - బలవంతు డెవడయా?
మొండివాని బలము - మెండు సుమ్ము;
మొండి వాని మించు - మొనగాడు ఎవడయా?
పిచ్చి వాని బలము - హెచ్చు సుమ్ము.

అవివేకి

స్వానుభవము - ప్రజకు - జ్ఞాన మిచ్చును వేగ
పరుల నుండి నేర్చు - ప్రాజ్ఞు డైన;
స్వానుభవము మరచు - అవివేకియౌ వాడు,
పరుల అనుభవమ్ము నరయ లేడు.

శాంతి

వింగడించి - తర్క విచికిత్స మాత్రమే
స్పష్టి గుట్టు - విప్పి చెప్ప లేదు !
త్యాగ లేశమైన - ఆదర్శ కణమైన,
లేని జ్ఞానమునకు - లేదు శాంతి.

మార్పు

మార్పు దేని కొరకు? మార్పు కోసమె గాదు;
చాలమంది ప్రజల మేలు కొరకు,
జయము పొందవచ్చు - శస్త్ర వైద్యము నందు;
ఫలము - సున్న - రోగి - బ్రదుకకున్న.

వివిధ వేదాంతములు

లేడు కష్టపడని వాడీ జగత్తులో,
వాన తడియనట్టి వాడు - లేడు;
వెలయు - గొడుగు లట్లు - వివిధ వేదాంతముల్,
నప్ప వొకటి - ఇంటి కప్పు లట్లు.

నిప్పు రవ్వ

నిప్పు రవ్వ కాంతి - నిముస మైనను చాలు,
ఒక్క క్షణము చాలు - ఉల్క వెలుగు;
వగల - చాల నాళ్లు - పొగచూరు - బ్రదు కేల?
చాలు - ఒక్క గడియ - పూల తావి.

వెలుగు

వెలుగు వచ్చు గాక - వేయి దిక్కుల నుండి;
ఎడదలోని - కెల్ల లెల్ల గడిచి,
మసలు గాక - మనిషి - వసుధైక పౌరుడై,
మతము మరిచి - జాతి మమత తుడిచి.

సహృదయత

జగతి - అరుదు గావు - శక్తి సామర్థ్యముల్;
ప్రజకు వేరు వేరు - ప్రజ్ఞ లుండు !
చాల అరుదు - పరుల శక్తి సామర్థ్యముల్
గుర్తు పట్ట గలుగు గొప్పతనము.

దండనీతి

"దండనీతి" లేక - ధరణి పాలన - లేదు;
ఎలుక - గుడ్డి పిల్లి కెదురు - తిరుగు;
నేరగాని ఎడద - మారి పోవుట కల్ల;
కఠిన శిక్ష ముందు - కరుణ పిదప.

అన్యాయము

నరుడు - ఓర్చు కొనును - దురదృష్ట మెంతైన;
వ్యాధు లైన - ఈతి బాధ లైన;
అణగి యుండ లేడు - అన్యాయ మెదురైన,
తిరుగుబాటు - లేవదీయ జూచు.

కళలు

బ్రదుకు నందు వాడబడెడి తీరులు చూడు,
కవిత గాని - లలిత కళలు గాని;
ఒజ్జ చేతిలోన - ఊగు "బెత్తము' వేరు,
గ్రుడ్డి వాని - "ఊత కోల" - వేరు.

సంఖ్యావేదము

సంఖ్య లందు కలవు - సంగీత మాధురీ
తత్త్వ సామరస్య తాళ లయలు;
విశ్వ శిల్ప వాస్తు వేదాంత సారమ్ము,
గణిత శాస్త్రమందు - కాన నగును.

వ్యాకరణము

తాల్ప గూడ దెపుడు - తల కిరీటమ్ముగా
రాజసమున వ్యాకరణము నెపుడు;
కవులు వాడ దగును - కాళ్ల చెప్పుల వోలె;
వ్యాకరణము - వాఙ్మయమ్ము నందు.

త్యాగము

సాధనాలు కావు - సంతాన సంపదల్
సత్క్రియాచరణము - జ్ఞాన పటిమ
త్యాగ మొకటి - అమృత యోగ సిద్ధికి - త్రోవ
సకల ధర్మ సార సంగ్రహమ్ము.

జ్ఞాపకము

పాటలు పాడి, నన్ను పసి బాబును
ఊయల లోన ఊచుచున్
ఆటలు నేర్పు దాదిని రహస్యముగా
పొదరింటి లోనికిన్
పైట చెరంగు బట్టి - పెరవా డెవడో-
తరలించు దృశ్యమున్,
మాటలు వచ్చినంతటనె మాతకు
చెప్పదలంచినాడ నే.

వయఃస్తంభన విద్య

సంభృత చాక చక్య లగు
స్వర్గ పురంధ్రులు - మేనకోర్వశీ
రంభలు - నిత్య యౌవన విరాజిత
లందురు గాని - మర్త్య వి
శ్వంభర మించి పోయినది
స్వర్గమునే ! సుకుమారతావయఃస్తంభన విద్య - వెండి తెర
తారలకున్ వశమయ్యె బాపురే !

జాలి గుండె

చదువు లేల? తర్క శాస్త్రవాదము లేల?
ప్రగతి పేర - తెగని రగడ లేల?
వివిధ మతము లేల? వేద వాదము లేల?
"జాలి గుండె" యున్న - చాలు - చాలు.

అంతరాత్మ

కవచ మేది - బ్రదుకు కదన రంగము నందు?
ఏది - నిదుర గొలుపు మృదుల శయ్య?
గొడుగ దేది - తిట్ల వడగళ్ళ వానలో?
స్వచ్ఛమైన - అంతరాత్మ - సుమ్ము.

ఐకమత్యము

చేలదీసి ప్రజల పాలించు సూత్రమే
నిక్కమైన రాజనీతి గాదు;
అచ్చమైన ప్రగతి - ఐకమత్యము సుమ్ము
సకల సౌఖ్యములకు జనని "శాంతి".

కలలు

కలలు గనుము - రాత్రి - కవితా జగత్తులో,
పిదప - మేలుకొనుము - నిదుర మాని;
పగలు కనులు విప్పి - పని చేయకున్నచో
కలలు నిజము కావు - కల్ల లగును.

సంతకాలు

జగతి యెల్ల యెడల - భగవంతు సంతకాల్
కనులు విప్పి చూడ - కానుపించు;
గణితబద్ధమైన - గ్రహతారకల యందు
పువ్వు లందు - బిడ్డ నవ్వు లందు.

తపోవనము

అడవి నున్న - ఆస లడుగంటి పోవునా?
మేటి తృప్తి కలదె - మేడ మీద?
ఇంద్రియాల నదిమి - ఇంటిలో ఉన్నచో
అదె తపోవన - మదె ఆశ్రమమ్ము.

తెగడ్త

పరుల నెల్ల - సతము - బహిరంగముగ పూని
తెగడు చెండు నెవడు వగవ కుండ?
ఆంతరంగికముగ - అణువంత తనమీద
నమ్మకమ్ము లేని నరుడు - సుమ్ము.

బహుమతి

ఇవ్వ దలచుకొనిన - ఏవైన బహుమతుల్
పుస్తకాలు మేలు - బొమ్మ లేల?
చదువ వచ్చు నెపుడొ - సంస్కారి, గ్రంథమ్ము
బూజు పట్టుచుండు - బొమ్మ యైన.

విద్యాలయము

విత్తనాలు దొరుకు - విద్యాలయాలలో
అమ్మ బడవు - ఫలము - లమ్మ బడవు;
గుండె పొలము దున్ని - పండించు కోవచ్చు
విత్తి - గొప్పవైన విలువ లెల్ల.

ఆమె అరుపు

కుక్క ఏలె - ఆమె - కోపమ్ము చూపించు,
మొరుగ గలదు మరియు కరవ గలదు;
కాటు కంటె గూడ - కడు దుర్భరము సుమ్ము
ఆమె అరుపు - అతి భయంకరమ్ము.

మత్తు

మతము నందు లేదు - మద్య మందున లేదు,
మత్తు - లేదు - "నల్లమందు" లోన;
మత్తుకలదు - అసలు - మనిషి మానస మందు;
మనిషి - బ్రదుక లేడు - మత్తు లేక.

సహనము

సామరస్య మందె - సత్యమ్ము నివసించు;
వాద భేద మయము - వసుధ యెల్ల;
నిండియుండు చదువు - ఖండ సత్యాలతో;
సంస్కృతి ప్రతీక - సహన నిరతి.

కళ్యాణము

అడవి లోని ఉసిరి - కడలి లోపలి ఉప్పు,
ఊరగాయ యందు - చేరునట్లు;
కలియు - వరుడు వధువు - కల్యాణ ఘటనలో;
మేలు - పర పరాగ మేళనమ్ము.

చరిత్ర

పూర్వ చరిత - అరయ - పునరావృతం బౌను;
జగతియందు రెండు సార్లు - తరచు;
మొదట దాపురించు - అది విషాదాంతమై
పెద్ద ప్రహసన మయి - పిదప - వచ్చు.

కర్మయోగి

అరవవచ్చు - నేత - ఆర్భాటమును చూపి
పేరు కోరి - పదవి కోరి కోరి;
తరచు - కర్మయోగి - తెర వెన్కనే యుండి
పదవి కోరకుండ - పనులు చేయు.

కర్తవ్యము

ఇష్ట మున్న యెడల - ఇష్టమ్ము లేకున్న,
మనిషి చేయవలయు - పనులు కొన్ని;
కార్యశూరు డగుచు - కర్తవ్యములు చేయ
బ్రదుకు ధన్య మగును - రక్తి కట్టు.

విత్తనాలు

విజ్ఞులైన వారు - విద్యార్థులను రేపి
త్రోయరాదు - రాజకీయ మందు;
తిండి కొరత - ఎంత తీవ్రమ్ముగా నున్న,
విత్తనాల నుడుక బెట్టరాదు.

హోమరు కవి

తిరిగె - తిరిప మెత్తి - పుర సప్తకమ్ములో
హోమరు కవి - బ్రతికియున్న నాళ్లు;
"హోమరు" మరణింప - యుద్ధమ్ము లొనరించె
సప్త పురము లతని శవము కొరకు.

శాంతి

సాంఘికాభ్యుదయము - శాంతి భద్రతలలో
సర్వతోముఖముగ - సాగ గలదు;
సర్వ నాశనమ్ము - సంఘటించును - హింస;
సకల సౌఖ్యములకు జనని - శాంతి.

ఉత్సాహము

ఉన్న యెడల - చాల దుత్సాహ శీలమ్ము,
వాట మెరిగి దాని వాడ వలయు,
వెడల లేడు వేగ - పిడి లేని కత్తితో,
యుద్ధరంగమునకు యోధు డెవడు.

అవెస్తా

అంతరాత్మ కంటె - అధ్యాపకుడు లేడు,
అరయ కాలమె యగు పరమ గురువు,
గ్రంథ రాజ మేది? - ప్రత్యక్ష లోకమే,
ఎవడు స్నేహితుండు? ఈశ్వరుండు.

చదువు

పొలము దున్న నేల - పలుమారు హలముతో
నాటకుండ విత్తనాల నెపుడు?
చదువ నేల? పెక్కు శాస్త్రాలు గ్రంథాలు?
బ్రదుకు నందు - పొందు పరచకుండ.

హాస్య వాక్కు

కత్తి వోలె గాక - కవచమ్ము రీతిగా
వాడ వలెను - హాస్య వాక్కు నెపుడు;
తాను దెబ్బనుండి - తప్పుకోవలె గాని,
పరుల నెపుడు - గాయ పరుప రాదు.

భిన్న దర్శనాలు

దార్శనికుల - వివిధ తత్త్వ వేదాంతముల్,
భిన్న వాద పిష్ట పేషణములు;
భూత సంతతులకు - పూర్ణ సంతోషమ్ము
పొంద చేయు విందు భోజనములు.

వెరసి మనిషి

సగటు మనిషి వేరు - సాధారణుడు వేరు;
వేరు "వెరసి మనిషి" తీరు వేరు;
ఎడద ఆటు పోటు - హేతువాదము - వేరు;
మనిషి దివికి భువికి మధ్య - లంకె.

అనువాద కళ

అరయ - వధువు వంటి దనువాద కళ యన్న,
సుందరాంగి కాదు - సుగుణ యైన
అందకత్తె యైన - అవిధేయురాలౌను!
సొంత రచన మేలు - సులువు, శుభము.

వేదాంతి

దాపురించి నపుడు - దైన్యమ్ము - దుఃఖమ్ము,
ప్రక్కవాని కెరుక పరచకుండ,
కష్ట మనుభవించ గలవాడె - వేదాంతి,
ధర్మమూర్తి యైన - ధైర్యశాలి.

మర్రి విత్తు

చేరియుండ వలెను - చిన్న పద్యము నందు
గొప్పదైన - భావ గుంఫనమ్ము;
విత్తు నందు - మర్రి వృక్ష మున్నట్లుగా;
మన్న మిన్న గలుపు మహిమ గలిగి.

కోరికలు

కలికి సీతకోక చిలుకలే - కోరికల్
పట్టుబడవు వెంట బడిన యెడల
విడిచి కూరుచున్న యెడల - కొండొకచోట
వచ్చి భుజము పైన - వాల వచ్చు.

చరిత్ర

విషయ చర్వణమున - విజ్ఞాన శాస్త్రమే
రచనయందు "చరిత" లలిత కళయై,
వింగడింప - విశ్వ వేదాంత సారమే
సత్యశోధనమ్ము - చరిత కాత్మ.

నిద్ర

నిద్ర నరుల కెల్ల - నిజమైన ప్రియురాలు
అంతరంగమునకు - ఆట విడుపు
కలుగజేయు - స్పర్శ వలన - జీవన్ముక్తి
వెర్రి తలలు వేయు వెతలు బాసి.

ఆదర్శ కవి

మెదడు లోన - "మార్క్స్" - హృదిలోన "బుద్ధుడై",
విప్లవమ్ము కరుణ - వింగడించి;
పుట్టుగాక - "సుకవి" - భువనైక పౌరుడై
ప్రగతి కొరకు - నూత్న జగతి కొరకు.

కవితాప్రభాస : అనుక్రమణిక

శీర్షికలు	పుటలు
రచయితకు కవితా కర్పూర నీరాజనాలు	3
About the Author	6
అంకితము	7
గాంధీ మహాత్ముడు	8
స్వాగతాంజలి	11
సందేశము	15
లలిత కళలు	16
నరులు	16
గురు స్తుతి	17
స్వాప్నిక సరస్వతి	20
కవితా ప్రభాస	22
విద్య శిల్పము	24
స్వాతంత్ర్య శపథము	25
బ్రదుకు	29
స్త్రీ	31
ఒంటరి బాటసారి	32
పూవులు	33
ప్రయోజకుడు	34
అంతరాత్మ బలము	38
జయాపజయాలు	39
సమస్యలు	40
పట్టుదల	41
ప్రగతి	42
మానవత	43
కాలము	45
వయస్సు	46
వెలుగుబాట	47
అభినవ పంచశీల	47
మతము	47
తపోవనము	48
పసిపాపలు	50
నదులు కలుపు	52
మతము	53
పూజా పుష్పాలు	53
యోగము	54
అద్వైతము	55
పడుచుదనము	56
అష్టావధానము	58
స్వధర్మము	59
సత్యంవద	59
విద్య విద్య కొరకే	60
నోరు	61
కన్నులు	62
వైద్యశాల	64
ఆట	65
వ్రతభంగము	65
చట్టాలు	66
ఉదయం	67

కవితాప్రభాస : ముక్తకములు

అనుక్రమణిక

శీర్షికలు	పుటలు	శీర్షికలు	పుటలు
నాలుక	68	బ్రదుకు తెరువు	74
కవులు	68	అవకాశములు	74
కావ్యము	68	వాదగోష్ఠి	74
తోడుచుక్క	68	ప్రజాస్వామికము	74
నిజము	69	నిఘంటువు	75
పేకాట	69	సెలవలు	75
చెవులు	69	పెండ్లి	75
గుర్తింపు	69	ధర్మము	75
ఐన్‌స్టీను	70	సత్యము	76
న్యూటను	70	మార్పు	76
ప్రజాస్వామికము	70	ఝంకృతి	76
ప్రతిభ	70	గొప్ప నిజము	76
రాజకీయాలు	71	తోటబడులు	77
భార్య కనులు	71	వేదాంతవిద్య	77
ఉపన్యాసము	71	మంచిమనసు	77
ఆశ	71	మానవత	77
సున్న	72	వెరసి మనిషి	78
నిర్ణీత కాలము	72	వృక్షో రక్షతి రక్షితః	78
అపజయము	72	సత్యం	78
అవినీతి	72	గడ్డి కాడ	78
వేళ్లు	73	భోగి-యోగి	79
శాసనకర్త	73	ఉయ్యాల ఊపులు	79
పక్షి	73	హలము-కలము	79
ఏకాకి	73	బ్రదుకు	79

శీర్షికలు	పుటలు	శీర్షికలు	పుటలు
నేడు	80	కృషి	87
కలలు - క్రియలు	80	చరిత్ర	87
కైవల్యము	80	ధైర్యము	87
ఉత్త చేయి	80	తెగువ	87
అభిరుచి	81	స్వాతంత్ర్యము	88
జాగ్రత్త	81	సుభాషితాలు	88
సంతృప్తి	81	నమ్మకము	88
మనిషి	81	కన్నతల్లి	88
పిప్పిపన్ను	82	కవులు	89
విప్లవాగ్ని	82	సుడిగాలి పంట	89
ముసలి మిరియము	82	స్నేహము	89
కీడు-మేలు	82	మైత్రి	89
రూపాయి	83	వాగుడు	90
సంశయాత్మ	83	స్వాతంత్ర్యము	90
దానము	83	సొంతవల	90
ఆయుర్దాయము	83	చీవాట్లు	90
మృత్యువు	84	అనుభూతి	91
నీతిబోధ	84	చుక్కాని	91
కర్తవ్యములు	84	కినుక	91
సమయసారిణి	84	మౌనము	91
వేదాంతము	85	ఎవరు నుడువ గలరు?	92
తన్నుగూర్చి	85	అభ్యాసము	92
అవసరము	85	దురదృష్టము	92
పాత దెయ్యము	85	క్రొత్తదనము	92
ఎన్నికలు	86	ఒప్పు	93
సువర్ణ సూక్తము	86	దారిలో	93
సహకారము	86	సూర్యోదయము	93
నవ్వు	86	కర్మయోగము	93

శీర్షికలు	పుటలు	శీర్షికలు	పుటలు
త్రికరణ శుద్ధి	94	కలలు	101
వాద తీవ్రత	94	సంతకాలు	102
భజన	94	తపోవనము	102
భగవద్ గీత	94	తెగడ్త	102
విలువలు	95	బాహుమతి	102
సామరస్యము	95	విద్యాలయము	103
దీక్ష	95	ఆమె అరుపు	103
అన్నతములు	95	మత్తు	103
శిశువు	96	సహనము	103
వింత ప్రణయం	96	కల్యాణము	104
మొండివాడు	96	చరిత్ర	104
అవివేకి	96	కర్మయోగి	104
శాంతి	97	కర్తవ్యము	104
మార్పు	97	విత్తనాలు	105
వివిధ వేదాంతములు	97	హోమరు కవి	105
నిప్పు రవ్వ	97	శాంతి	105
వెలుగు	98	ఉత్సాహము	105
సహృదయత	98	అవెస్తా	106
దండనీతి	98	చదువు	106
అన్యాయము	98	హాస్యవాక్కు	106
కళలు	99	భిన్నతత్వము	106
సంఖ్యావేదము	99	వెరసి మనిషి	107
వ్యాకరణము	99	అనువాద కళ	107
త్యాగము	99	వేదాంతి	107
జ్ఞాపకము	100	మరిచివిత్తు	107
వయఃస్తంభన విద్య	100	కోరికలు	108
జాలిగుండె	101	చరిత్ర	108
అంతరాత్మ	101	నిద్ర	108
ఐకమత్యము	101	ఆదర్శ కవి	108